


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 271, పేజీలు - 08

గురువారం, మార్చి 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# అగ్నిపరీక్షగా మూసి ప్రక్షాళన

## - మాటలకే ఇంత కాలం మరి చేతలెప్పుడు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసి పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో, ప్రజల్లో హాట్ టాపిక్ గా మారింది. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి నదిని లండన్ లోని థేమ్స్ నదిలా మారుస్తామని, నదీ తీరాన్ని ఆర్థిక హబ్‌గా మారుస్తామని భారీ స్థాయిలో ప్రచారం కల్పిస్తున్నారు. ఇటీవలే రూ.7,000 కోట్లతో మొదటి విడత పనుల మాస్టర్ ప్లాన్‌ను కూడా ఆవిష్కరించారు. అయితే, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా, పనులు ఇంకా ప్లానింగ్ , సర్వే దశలోనే ఉన్నాయి. 55 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు కేవలం భూసమీకరణ నోటిఫికేషన్లు , కొన్ని ప్రాథమిక నిర్మాణాలకే పరిమితం కావడం ప్రజల్లో సందేహాలను రేకెత్తిస్తోంది.

**వివాదాల సుడిగుండంలో నిర్వాసితులు**

ఈ ప్రాజెక్టుకు అతిపెద్ద అడ్డంకి నిర్వాసితుల సమస్య. నది పరివాహక ప్రాంతంలోని దాదాపు 10,000 పేద కుటుంబాలను తరలించడం అనేది ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. మూసి జన ఆందోళన వంటి వేదికల ద్వారా బాధితులు తమ నిరసనలు తెలుపుతుండగా, ప్రతిపక్షాలు దీనిని లూటిఫికేషన్ అని విమర్శిస్తున్నాయి. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ, తమ జీవనోపాధి దెబ్బతింటుందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయంగా ఈ వ్యతిరేకతను అధిగమించడం రేవంత్ సర్కార్‌కు పెద్ద సవాలు.

**వెంటాడుతున్న నిధుల సమస్య**

ప్రభుత్వ పదవీకాలంలో మిగిలి ఉన్న రెండున్నరేళ్ల సమయం ఈ భారీ ప్రాజెక్టుకు చాలా తక్కువ.

2లో..

# రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

## - రాజ్యసభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు.

**కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలన్న ప్రధాని**

హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని

2లో..

# డ్రగ్స్ కేసులో బెయిల్‌పై మా ప్రమేయం లేదు

## - మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన



హైదరాబాద్ / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్టి చర్చల్లో రాష్ట్ర రాజకీయాలు, జమిలి ఎన్నికలు, మోయినాబాద్ డ్రగ్స్ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో 2028లో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఆయన మాత్రం జరగబోవని చెబుతున్నారు.

**ఆరు నెలల ఆలస్యంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు**

2028లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు రావని, 2029లో దేశవ్యాప్తంగా జరిగే జమిలి ఎన్నికలతో పాటే రాష్ట్రంలోనూ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియ పూర్తయిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని, ఆ తర్వాతే ఎన్నికలు జరుగుతాయని ఆయన వివరించారు. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కాలం కాకుండా మరో ఆరు నెలలు అధికంగా అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**మహిళా రిజర్వేషన్లకు సిద్ధం**

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అమలుపైనా మాట్లాడారు. ఈ చట్టం ముందే అమల్లోకి వస్తే తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాగతిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలకు రిజర్వేషన్లు

2లో..

# డాలర్ జోరు.. రూపాయి బేజారు

## - ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. ట్రేడింగ్‌లో రూపాయి విలువ 92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ నిధుల తరలింపు కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన

2లో..

# దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే దివ్యాంగశక్తి

## - 'దివ్యాంగశక్తి' పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లోని దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన దివ్యాంగశక్తి పథకాన్ని అమరావతి వేదికగా ప్రారంభించింది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ఈ పథకాన్ని ప్రారంభించారు. బస్సులో ప్రయాణించి దివ్యాంగులతో మాట్లాడారు.

**ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం**

ఆంధ్రప్రదేశ్‌లోని దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఏపీ ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఏపీఎస్ఆర్టీసీకి చెందిన సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చు. మొత్తం 21 కేటగిరీలకు చెందిన, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈ సదుపాయం వర్తిస్తుంది. సహాయకులతో కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

2లో..

# ఉగాది కానుకలుగా మట్టి వంట పాత్రల కిట్ గిఫ్ట్

## - మంత్రి పొన్నం వినూత్న ఆలోచన వైరల్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉగాది పండుగను పురస్కరించుకుని తెలంగాణ అసెంబ్లీ వేదికగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మట్టి పాత్రల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, కుల వృత్తులకు జీవం పోయాలనే ఉద్దేశంతో ఆయన ఉగాది మట్టి పాత్రల కిట్‌లను పంపిణీ చేశారు.

**కుల వృత్తులకు అండగా.. ఉగాది వేళ మంత్రి పొన్నం పిలుపు**

రాష్ట్రంలోని కుల వృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభ ఆవరణలో ఉగాది మట్టి పాత్రల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ఉగాది పచ్చడి తయారీకి ఉపయోగించే మట్టి

2లో..

# తెలంగాణ కాంగ్రెస్‌లో దుమారం.?

## - జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ కావాలన్న కోమటిరెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారాన్ని రేపాయి. ముఖ్యంగా ప్రస్తుత పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

2లో..

# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది

- వారిని గుండెల్లో పెట్టుకుంటామన్న సీఎం చంద్రబాబు
- నిర్వాసితుల త్యాగఫలమే ఇప్పుడు పోలవరం అన్న సీఎం
- రూ.226 కోట్ల పరిహారం జమ చేసిన సీఎం

2లో..



# మూసీలో లక్షన్నర కోట్ల దోపిడీ

- ప్రాజెక్టులో పారదర్శకత లేదంటూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్
- కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం.. తొలిదశకు రూ.7,000 కోట్ల అంచనా అని వెల్లడి
- డీపీఆర్ లేకుండా వేల ఇళ్లను ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు.

2లో..

# హైదరాబాద్ కేంద్రంగా.. మూడు బుల్లెట్ ట్రైన్ మార్గాలు

## - లోక్‌సభలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇండియన్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. దేశంలోని ప్రధాన నగరాలన్నింటినీ కలిపేలా హైస్పీడ్ రైలు బుల్లెట్‌లా దూసుకొస్తుందని చెప్పారు. ప్రధాన నగరాల మధ్య దూరం హైస్పీడ్ రైల్ కారిడార్‌తో తగ్గిపోతుందని, కొన్ని గంటల్లోనే ప్రధాన నగరాలను చేరుకుంటామని లోక్‌సభలో చెప్పారు. బుల్లెట్ రైలు రాకతో ముంబై పూణే మహానగాలు కలిసి పోయినట్లేనని కేవలం 48 నిమిషాల్లో ముంబై నుంచి పూణే చేరుకోవచ్చని చెప్పారు. కేంద్రమంత్రి ప్రసంగంలో హైదరాబాద్ పేరు ప్రముఖంగా వచ్చింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన మార్గాలు కలుపుతున్నాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. పూణె నుంచి రెండు గంటల్లో హైదరాబాద్‌కు వెళ్లొచ్చని హైదరాబాద్ నుంచి రెండున్నర గంటల్లో బెంగళూరు అక్కడి నుంచి కేవలం 72 నిమషాల్లో చెన్నైకి వెళ్లిపోవచ్చన్నారు. ఇక హైదాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకి మూడున్నర గంటల్లో వెళ్లిపోవచ్చన్నారు. దీంతో అమరావతి మీదుగా బుల్లెట్ రైల్ వెళ్లబోతోందన్న క్లారిటీ కూడా వచ్చేసింది.

# రాజ్యాలు పోయినా ఇంకా రాచరిక పోకడే

## - అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు అన్న ముఖ్యమంత్రి
- కేసీఆర్ సభకు వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజ్యాలు పోయినా రాచరిక పోకడలు పోలేదని, కొంతమంది ఇంకా తమను తాము రాజులుగా భావించుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అదే పోకడ, ప్రతిపక్షంలో ఉన్నా అదే తీరు

2లో..

# అగ్నిపరీక్షగా మూసి ప్రక్షాళన

2027-28 నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, నిధుల సమీకరణ, వాస్తవ నిర్మాణం వంటి క్లిష్టమైన దశలు దాటాల్సి ఉంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థల నుంచి నిధులు ఆశిస్తున్నప్పటికీ, అవి సకాలంలో అందడం, పనుల్లో వేగం పెంచడంపైనే ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

### రాజకీయ పరపతికి పందెం

ప్రజలు కేవలం విజన్ను చూసి ఓట్లు వేయరు, ఫలితాలను బట్టి నిర్ణయించుకుంటారు. ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని చెప్పడం రాజకీయంగా ప్రయోజనం చేకూర్చవచ్చు కానీ, సామాన్య ప్రజలు మాత్రం క్షేత్రస్థాయిలో మార్పును కోరుకుంటారు. ఒకవేళ వచ్చే రెండున్నరేళ్లలో కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి కాకపోతే, ఇది కేవలం మాటల సీఎం అనే విమర్శకు ఆస్కారం ఇస్తుంది. గత ప్రభుత్వాల హయాంలో కూడా ఇలాంటి ప్రకటనలు వచ్చి ఆగిపోయిన చరిత్ర ఉండటంతో, రేవంత్ రెడ్డిపై ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంది.

### పనుల్లోవేగం పెంచాలి!

కేవలం గ్రాఫిక్ డిజైన్లు, ప్రసంగాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం తక్షణమే పనులను పట్టాలెక్కించాలి. నదిలో మురికినీరు కలవకుండా చేసే ఎస్టీపీల నిర్మాణం, నదీ గర్భం ప్రక్షాళన వంటి ప్రాథమిక పనులు కంటికి కనిపిస్తేనే ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో పారదర్శకత పాటిస్తూ, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానంగా పనుల పురోగతిని చూపడమే రేవంత్ రెడ్డి ముందున్న ఏకైక మార్గమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు.పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు.

## దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం

# నింపేందుకే దివ్యాంగశక్తి

ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ. 207 కోట్ల భారీ వ్యయాన్ని భరించనుంది.

### దివ్యాంగులకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "దివ్యాంగులంటే విభిన్న ప్రతిభావంతులు. వారిలో ఆత్మవిశ్వాసం నింపి, సాధికారత సాధించేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. కేవలం సాయం అందించడమే కాకుండా, వారి ఖర్చులను తగ్గించి గౌరవాన్ని పెంచడంపైనే దృష్టి సారించాం. గతంలో రూ.500గా ఉన్న పింఛన్‌ను మేమే దశలవారీగా పెంచాం. ఇప్పుడు రూ.6,000 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణంతో వారికి నెలకు సుమారు రూ.2,000 వరకు ఆదా అవుతుంది" అని వివరించారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే దివ్యాంగుల పింఛన్ పెరిగిందని, 'దివ్యాంగశక్తి' వంటి పథకాలు అమలవుతున్నాయని చంద్రబాబు గుర్తుచేశారు. "గత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా పింఛన్ పెంచలేదు. అంతేకాకుండా, దివ్యాంగుల కోటాలో అర్హత లేని వారు కూడా ఉద్యోగాలు, పింఛన్లు పొందడం బాధాకరం. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం స్పష్టం చేశారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' పథకం ద్వారా ఇప్పటికే 52 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, అదే స్ఫూర్తితో 'దివ్యాంగశక్తి' కూడా విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### సామాజిక బాధ్యత : పవన్ కళ్యాణ్

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దివ్యాంగుల పట్ల కనికరం కంటే గౌరవం చూపడం ముఖ్యమని స్పష్టం చేశారు. దివ్యాంగశక్తి పథకం అనేది ఒక సామాజిక బాధ్యత. వారి కదలికలకు ఆర్థిక భారాలు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం అని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేస్తుందని, దివ్యాంగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ పునరుద్ఘాటించారు.

### అవరోధాలు లేని ఆంధ్రప్రదేశ్ : నారా లోకేష్

మంత్రి నారా లోకేష్ ఈ పథకాన్ని యువత , విద్యార్థి దివ్యాంగులకు గొప్ప వరంగా అభివర్ణించారు. చదువుకోవడానికి లేదా ఉద్యోగాల కోసం వెళ్లే దివ్యాంగులకు ప్రయాణ ఖర్చులు భారం కాకుండా ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రాన్ని అవరోధాలు లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే మా లక్ష్యం. ఐటీ , ఇతర రంగాల్లో కూడా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాం అని లోకేష్ వివరించారు. కార్యక్రమం తర్వాత చంద్రబాబు తన క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు విందు ఇచ్చారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో దుమారం.?

సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపినట్లుగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయనే విమర్శలు రావడంతో, కోమటిరెడ్డి దీనిపై వివరణ ఇచ్చారు.

### నా మాటలను వక్రీకరించారు

సంగారెడ్డిలో జరిగిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో జగ్గారెడ్డి ఆర్గనైజింగ్ సామర్థ్యాన్ని మెచ్చుకుంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రబిందువు అయ్యాయి. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు వస్తాయని ఆయన అనడం, ప్రస్తుతం పదవిలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌ను కించపరచడమేనని పార్టీ వర్గాల్లో చర్చ నడిచింది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పీసీసీ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి.

### మహేష్ కుమార్ గౌడ్‌తో స్నేహం

ఈ వివాదంపై స్పందించిన కోమటిరెడ్డి, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మహేష్ కుమార్ గౌడ్ నాకు ఎన్ఎస్‌యూఐ రోజుల నుండి అత్యంత సన్నిహిత మిత్రుడు. ఆయన సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాం అని ఆయన ప్రశంసించారు. మహేష్ కుమార్‌పై తాను ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని, కొందరు కావాలనే తన మాటలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

### జగ్గారెడ్డిపై వ్యాఖ్యల వెనుక ఉద్దేశం

సంగారెడ్డి కార్యక్రమంలో తాను చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని కోమటిరెడ్డి వివరించారు. అక్కడ జగ్గారెడ్డి చేసిన జనసమీకరణ, కార్యక్రమ నిర్వహణ తీరు చూసి ముగ్ధుడనై, భవిష్యత్తులో ఆయనకు పీసీసీ అయ్యే అర్హత ఉందని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు. ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షుడిని తొలగించాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, జగ్గారెడ్డి పనితీరును మెచ్చుకోవడమే తన ప్రధాన ఉద్దేశమని ఆయన క్లారిటీ ఇచ్చారు.

ఈ వివరణతో పీసీసీ వివాదానికి తెరదించే ప్రయత్నం చేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ల మధ్య ఉన్న అంతర్గత పోటీ మరోసారి బహిర్గతమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కోమటిరెడ్డి వివరణతో ప్రస్తుతానికి ఈ వివాదం సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

# డాలర్ జోరు.. రూపాయి బేజారు

సంగతి తెలిసిందే. కీలకమైన 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హర్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.

# ఉగాది కానుకలుగా మట్టి వంట పాత్రల కిట్ గిఫ్ట్

కుండలు, గిన్నెలు . ఇతర మట్టి ఉపకరణాలను ఉంచారు. పండుగ రోజున ప్రతి ఇంటా మట్టి పాత్రలనే ఉపయోగించి ప్రకృతితో మమేకమవ్వాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు కూడా తమ నియోజకవర్గాల్లో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి కుమ్మరి వృత్తిదారులకు అండగా నిలవాలని ఆయన కోరారు.

### ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

ప్లాస్టిక్, సింథటిక్ వస్తువుల వాడకం వల్ల పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి పాత్రల్లో వంటలు చేయడం వల్ల ఆహారంలోని పోషక విలువలు అలాగే ఉంటాయని, ఇది మన పూర్వీకుల నుంచి వచ్చిన గొప్ప సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. ఉగాది వంటి పండుగలను ప్రకృతి సిద్ధమైన వస్తువులతో జరుపుకోవడం వల్ల భవిష్యత్తు తరాలకు మనం పర్యావరణ స్పృహను అందించినట్లు అవుతుందని ఆయన సందేశమిచ్చారు.

### కుల వృత్తులకు జీవనోపాధి

కుమ్మరి వంటి సాంప్రదాయ వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మార్కెట్లో గ్లాసు, స్టీలు పాత్రల తాకిడి పెరగడం వల్ల కుల వృత్తుల వారు ఉపాధి కోల్పోతున్నారని, ప్రజలు మళ్ళీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపితేనే వారి బతుకుల్లో వెలుగులు నిండుతాయని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం తరపున కుల వృత్తులకు అవసరమైన ఆధునిక యంత్రాలను, రాయితీలను అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

### గౌరవప్రదమైన వృత్తులుగా మార్పు

వృత్తి పనిని కేవలం కాయకష్టంగా చూడకుండా, దానిని ఒక కళగా గౌరవించాలని మంత్రి పిలుపునిచ్చారు. చట్టసభల వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సామాన్య వృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రాముఖ్యతను చాటిచెప్పారు. తెలంగాణ సంస్కృతికి చిహ్నాలైన కుల వృత్తులను కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్ కేసులో బెయిల్‌పై మా ప్రమేయం లేదు

ముందే వస్తే సంతోషమే, మేము అందుకు సిద్ధంగా ఉన్నాము అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇప్పటికే మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

### మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వం ప్రమేయం లేదు

మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ దాడిపై రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ కేసులో టీడీపి ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడటం, ఆయనకు స్టేషన్ బెయిల్ లభించడం వంటి అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. ఈ కేసులో ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఎంపీకి స్టేషన్ బెయిల్ ఇచ్చింది పోలీసులు మాత్రమే, ఇందులో రాజకీయ జోక్యం లేదు అని స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసును అత్యంత పారదర్శకంగా, త్వరితగతిన విచారించడానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసిందని సీఎం తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు సిట్ తన విచారణను కొనసాగిస్తోందని, నిందితులు ఎవరైనా సరే వదిలే ప్రసక్తి లేదని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. సిట్ తన పని తాను చేసుకుంటుంది, ఇందులో మేము చేసేది ఏమీ లేదు అని చెబుతూనే, రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

# మూసీలో లక్షన్నర కోట్ల దోపిడీ

జనవరిలో జరిగిన సమావేశాల్లో మూసీ డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు మార్చి బడ్జెట్ సమావేశాల నాటికే డీపీఆర్ సిద్ధమైందని ఎలా చెబుతోందని ఆయన ప్రశ్నించారు.

### డీపీఆర్ సంస్థపై కేటీఆర్ ఆరోపణలు

మూసిలో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.. అందుకే ఈ అంశం పై సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ తయారీ బాధ్యతలను అప్పగించిన 'మెయిన్ హార్ట్' సంస్థపై కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్తాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన మరియు అనేక కేసుల్లో ఇరుక్కున్న బ్లాక్ లిస్ట్ సంస్థకు ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని ఆయన నిలదీశారు. అటు ఏడీబీ సంస్థ కూడా తాము మూసీపై ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని లేఖ రాయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు ముఖ్యమంత్రి లక్షన్నర కోట్లు ఖర్చు అవుతుందని, మరోవైపు 4 వేల కోట్లు అని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మండిపడ్డారు.ప్రభుత్వ గెజిట్ ప్రకటనలకు, మంత్రుల మాటలకు అస్సలు సంబంధం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. అసలు డీపీఆర్ లేకుండానే 1,400 నిర్మాణాలను ఎలా గుర్తించారని ఆయన ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ గందరగోళంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి ఆస్కారం ఇచ్చేలా బ్లాక్ లిస్ట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడంపై క్లారిటీ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేశారు.

### బ్లాక్ లిస్ట్ సంస్థకు డీపీఆర్ బాధ్యతలా.?

మూసీ డీపీఆర్ తయారీ బాధ్యతలను 'మెయిన్‌హార్ట్' అనే సంస్థకు అప్పగించడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ సంస్థను గతంలో సింగపూర్, పాకిస్తాన్ మరియు భారతదేశంలోని జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో బ్లాక్ లిస్ట్ చేశారని, ఎన్నో వివాదాలున్న సంస్థకు ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారని కేటీఆర్ నిలదీశారు. గతంలో ఇదే సభలో డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పిన ప్రభుత్వం, కేవలం 2 నెలల్లోనే అది ఎలా సిద్ధమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అంత వేగంగా సిద్ధం చేస్తే, ఆ నివేదికను సభ ముందు పెట్టి ప్రజలకు వివరించాలని కోరారు.

### ఏడీబీ రుణంపై అయోమయం

మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సుమారు రూ. 4,100 కోట్ల రుణం ఇస్తోందని తెలంగాణ ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, కానీ ఆ సంస్థ నుండి తమకు అందిన సమాచారం ప్రకారం ఎలాంటి డీపీఆర్ అందలేదని, రుణంపై స్పష్టత లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

### పెరిగిన వ్యయం - కూల్చివేతల భయం

గతంలో రూ. 16 వేల కోట్లతో పూర్తవుతుందని చెప్పిన ఈ ప్రాజెక్టుకు, సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా లక్షన్నర కోట్లు ఖర్చు అవుతుందని చెప్పడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, సభలో 1400 ఇళ్లు కూలుస్తామని చెబుతూనే, గెజిట్‌లో 10 వేలకు పైగా నిర్మాణాలను తొలగిస్తామని పేర్కొనడంపై క్లారిటీ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బఫర్ జోన్ పరిమితిని పెంచుతూ స్థానిక అధికారుల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అసలు ఎన్ని వేల ఇళ్లను కూల్చబోతున్నారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ పట్టుబట్టారు. కానీ సభలో సరైన తీరుగా చర్చ జరిగి ప్రభుత్వం వాస్తవాలు బయటపెట్టడం లేదని, అందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశామన్నారు.

# రాజ్యాలు పోయినా ఇంకా రాచరిక పోకడే

అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు, రాజులు అని గుర్తుంచుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలను వివరించామని అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతనే ప్రసంగం తయారు చేసినట్లు తెలిపారు. కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నాయకులు వస్తారని భావించామని, ప్రధాన ప్రతిపక్షంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందని భావించామని, గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయని భావించామని, కానీ ఏమాత్రం స్పందన రాలేదని అన్నారు.కేసీఆర్ సభకు వచ్చి, ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధానమంత్రి పీవీ విధానాలే కారణమని అన్నారు. పీవీ, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హైటెక్ సిటీకు పునాది రాయి వేశారని తెలిపారు. ఆ తర్వాత చంద్రబాబు, వాజ్‌పేయి హైటెక్ సిటీని పూర్తి చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ కారణంగా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నదని, ఈ పరిస్థితుల్లో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువులను పునరుద్ధరిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. నాలాల ఆక్రమణలను పరిష్కరించి ముంపు సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని ఆయన హయాంలో ఆదేశాలు ఇచ్చారని, నాటి బీఆర్ఎస్ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. సబర్మతి, గంగా, యమునా ప్రాజెక్టుల గురించి గొప్పగా చెబుతున్న బీజేపీ నాయకులు మూసీ ప్రాజెక్టును తప్పుబట్టడం విడ్డూరమని అన్నారు. మెట్రో రైలును విస్తరించేందుకు కష్టపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగరానికి


# డాలర్ జోరు.. రూపాయి బేజారు

సంగతి తెలిసిందే. కీలకమైన 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హర్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.


# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది

- వారిని గుండెల్లో పెట్టుకుంటామన్న సీఎం చంద్రబాబు
- నిర్వాసితుల త్యాగఫలమే ఇప్పుడు పోలవరం అన్న సీఎం
- రూ.226 కోట్ల పరిహారం జమ చేసిన సీఎం

అమరావతి (ప్రశ్న న్యూస్) పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారిని తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. వారి త్యాగఫలితంగానే రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సాకారం అవుతోందని అన్నారు. ఈరోజు తన క్యాంపు కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సమావేశమైన సీఎం, భూసేకరణ, పునరావాస ప్యాకేజీ కింద మూడో విడతగా రూ.226.61 కోట్ల చెక్కును వారికి అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ మొత్తాన్ని నేరుగా నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రాం వాల్ పనులు వారం రోజుల్లో పూర్తి కానున్నాయని ఆయన ప్రకటించారు.

### 21 నెలల్లో రూ.1943 కోట్ల పరిహారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు అండగా నిలుస్తోందని, గత 21 నెలల్లో మూడు విడతల్లో పరిహారం అందించామని సీఎం వివరించారు. 2025 జనవరిలో సంక్రాంతి కానుకగా తొలి విడత రూ.800 కోట్లు, గత ఏడాది దీపావళికి రెండో విడతగా రూ.916 కోట్లు, తాజాగా ఉగాది సందర్భంగా మూడో విడతగా రూ.226.6 కోట్లు జమ చేశామని తెలిపారు. ఈ 21 నెలల కాలంలో మొత్తంగా 26,149 మంది నిర్వాసితులకు రూ.1943 కోట్లు చెల్లించినట్లు స్పష్టం చేశారు. నిర్వాసితుల సంక్షేమం కోసమే రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

### గత పాలకుల వల్లే ప్రాజెక్టు ఆలస్యం

గత పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే డయాఫ్రాం వాల్ తీవ్రంగా దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నిపుణులతో అధ్యయనం చేయించి, సుమారు రూ.1000 కోట్లతో కొత్త డయాఫ్రాం వాల్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ చేతగానితనం వల్లే పోలవరం ప్రాజెక్టు 6-7 ఏళ్లు ఆలస్యమైందని, కాంట్రాక్టర్లను మార్చకుండా ఉంటే ఇప్పటికే పూర్తయ్యేదని విమర్శించారు. వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నాటి పాలకులు పట్టించుకోలేదని, ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదన్న అహంకారంతో వ్యవహరించారని మండిపడ్డారు.

### నిర్మాణ పనులు, పునరావాసం వేగవంతం

వచ్చే ఏడాది ఉగాది తర్వాత రెండు నెలల్లోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే గౌరవం తనకు దక్కిందని, పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా 75 పునరావాస కాలనీలు నిర్మిస్తుండగా, ఇప్పటికే 26 పూర్తి అయ్యాయని, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితులందరికీ పక్కా ఇళ్లతో పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు, ఇంటి జాగా కోసం ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచామని తెలిపారు. నిర్వాసిత యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని కూడా సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పరిహారంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయని నిర్వాసితులు ముఖ్యమంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే తమకు న్యాయం జరిగిందని, తమ ఖాతాల్లోకి డబ్బులు వస్తున్నాయని చెబుతూ పలువురు మహిళలు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రబాబే కలకాలం సీఎంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, ఆర్ అండ్ ఆర్ అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ కోసం

# వినియోగదారులు ఇబ్బందులు



**హోళగుంద** :మండల కేంద్రానికి ప్రతి బుధవారం భారత్ గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ, ఆదివారం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు లబ్ధిదారులకు ఆదోని నుంచి హోళగుందకు వచ్చి వినియోగదారులు అందించేవారు. అయితే ఆదివారం ఇండియన్ గ్యాస్,మంగళవారం భారత్ గ్యాస్ సిలిండర్ కోసం దాదాపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిలిండర్ లను వరుసలో గ్యాస్ సిలిండర్ కోసం పడిగాపులు కాసిన ఏజెన్సీవారు మాత్రం హోళగుందకు రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ముఖ్యంగా ఉగాది పండుగకు లబ్ధిదారులకు అవసరమైన సిలిండర్ అందకపోవడంతో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని....ప్రజల ఇబ్బందులు కనబడవా...అన్ని మండిపడ్డారు.మరియు సిలిండర్ రాకపోవడంతో దాదాపు 200 మంది వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో ఇళ్లకు వెనుదిరిగారు.కావున తహసీల్దార్ సమస్య పై దృష్టి సారించి సంబంధిత ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని చంద్రప్ప,చినిగి సాబ్,గాదిలింగ తదితరులు కోరా

# బద్వేల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరణ

**బద్వేలు** బద్వేల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా బత్తుల ఆర్టీవో చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు మంగళవారం మున్సిపాలిటీ పాలవర్గం కాలం తీరిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది అందులో భాగంగా బద్వేల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ చంద్రమోహన్ బాధ్యతలు స్వీకరించారు ఆయనకు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్** పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'తో పటిష్ట భద్రతఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు.?విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం.రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, కరీంనగర్ లో పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.?ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.?పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు మరియు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్కాపూర్ గ్రామంలో మానవత్వాన్ని చాటిన బీజేపీ నేతలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మల్కాపూర్ గ్రామం, నిరుపేద కుటుంబానికి చెందిన దుంపటి సత్తమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. బీజేపీ బోయినిపల్లి మండల శాఖ అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో, మల్కాపూర్ గ్రామ శాఖ నాయకులు కలిసి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెబుతూ భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో అమ్మిరి శెట్టి గంగయ్య, పబ్బుల వినోద్, బొంగోని ప్రదీప్, బొంగోని వినయ్, అమీర్శెట్టి అంజయ్య, ప్రసాద్, పబ్బుల మహేష్, మునిందర్, మల్లేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై దుష్ప్రచారాలు మానాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ : కనికరపు రాకేష్ ఆగ్రహం**



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పై జరుగుతున్న అసత్య ప్రచారాలను వెంటనే ఆపాలని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, ఆది శ్రీనివాస్ ధరించే వాచ్ విలువ కోటి రూపాయలదని సోషల్ మీడియా, కొన్ని టీవీ ఛానళ్లలో ప్రచారం చేయడం పూర్తిగా తప్పుడు సమాచారం అని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా కావాలని ఫేక్ న్యూస్ సృష్టిస్తున్నారని మండిపడ్డారు.ఈ ప్రచారాల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపిస్తూ, కేటీఆర్, హరీష్ రావు వంటి నేతల ప్రమేయం ఉందని అభిప్రాయ పడ్డారు.ప్రజల్లో మంచి పేరు సంపాదించిన నాయకుడిని కించపరచేందుకు కుట్ర జరుగుతోందని విమర్శించారు.సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి, క్రమంగా ఉన్నత స్థానానికి ఎదిగిన ఆది శ్రీనివాస్ ప్రజా నాయకుడిగా నిలిచారని కొనియాడారు. బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా ఆయన ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు.అసత్య వార్తలను ప్రసారం చేసిన మీడియా సంస్థలు వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని కనికరపు రాకేష్ హెచ్చరించారు.

## కొల్చారం మండల తాసిల్దార్ శ్రీనివాస్ చారి కి వినతి పత్రం అందజేసిన

**కొల్చారం మండలం బిజెపి అధ్యక్షులు పంతులు హరీష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలం రెవిన్యూ కార్యాలయం వద్ద బీజేపీ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పంతుల హరీష్ ఆ ధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారికి శ్రీనివాస్ చారి కి వినతిబీజేపీ కొల్చారం మండల అధ్యక్షులు హరీష్ పటేల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసమర్థ పాలనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టి తహశీల్దార్ కి మెమొరాండం సమర్పించడం జరిగిందిఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు హరీష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో అన్నిరంగాల ప్రజలు తీవ్ర అవస్థలు చెందుతున్నారని పేర్కొన్నారునిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అని మోసం చేశారనిరైతులకు రైతు భరోసా వేయకుండా మభ్యపెట్టడంవితంతులకు, దివ్యాంగులకు 2 ఏళ్లు కావొస్తున్న ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేయలేదుభూ భారతి పథకం పేరుతో భూ సమస్యలు పరిష్కారం చేస్తామని దరఖాస్తులకు పరిష్కారం లేదుఅని వివిధ అంశాలతో మెమోరెండం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్స్ శేఖర్ యాదవ్, బీజేపీ జిల్లా ఒబీజ మోర్చ ఉపాధ్యక్షులు చింతల యాదగిరి , బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లె రవికాంత్, బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షుడు కేతవత్ పూల్ సింగ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్, బీజేపీ కొల్చారం బూత్ అధ్యక్షుడు సంతోష్ , కిష్టాపూర్ బూత్ అధ్యక్షులు దుర్గాప్రసాద, శేఖర్, సీతారాం తాండ బూత్ అధ్యక్షుడు మలావత్ అంజి, మాందాపూర్ భూత అధ్యక్షుడు తలారి శేఖర్, మానయ్య బీజేవైఎం నాయకులు రామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన, నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష:

**నిందితులకు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వాచ్‌మెన్ స్వామి, అటెండర్ రాజుకు కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. విద్యార్థినుల భుజాలపై చేతులు వేయడం, వారు బట్టలు మార్చుకునే సమయంలో రహస్యంగా గమనించడం వంటి ఘటనలపై ఆగష్టు 2018 లో ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై అప్పటి తూప్రాన్ ఎస్ఐ నాగార్జున గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ఐఓలు డీఎస్పీ తూప్రాన్ రాంగోపాల్ రావు, కిరణ్ కుమార్‌లు పూర్తి సాక్ష్యాలను సేకరించారు. ప్రస్తుత ఐఓ గంగారాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు, భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేతా తదితరులు సహకరించినట్లు ఎస్పీ వివరించారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా ముద్దం కవిత - రవీందర్ గౌడ్

# దంపతుల పెళ్లిరోజు వేడుకలు

**- ఐక్యత,ఆనందానికి నిదర్శనంగా సాగిన ముద్దం దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు**

**- పరస్పర అవగాహనతో ఆదర్శంగా నిలుస్తున్న ముద్దం కవిత - రవీందర్ దంపతులు**

**- వేడుకకు హాజరైన అతిథులు - గ్రామస్తులు**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ మాజీ డైరెక్టర్ ముద్దం కవిత – రవీందర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వారి నివాసంలో సాదరంగా, ఆనందభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ, ముద్దం కవిత – రవీందర్ దంపతులు కుటుంబ బంధాలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్న ఆదర్శ దంపతులని అన్నారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాగే సంతోషంగా, ఐక్యంగా జీవిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని, నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ, బోయినిపల్లి మండల అభివృద్ధికి తోడ్పడడంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు కల్పించాలని, ఇలాంటి పెళ్లిరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆశిస్తూ ముద్దం కవిత –. రవీందర్ గౌడ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య,రామంచ బాబు, కొలుపుల మల్లేశం,అతికం చంద్రయ్య, పులి చంద్రయ్య, ఆంజనేయులు, వెంకటాచారి,సూదుల రవి,పచ్చునూరి సుధాకర్, తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

**అదనపు కలెక్టర్ నగేష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.బుధవారం జిల్లాలోని కౌడిపల్లి మండలం జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ . పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ కూల్చారు సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్య హక్కుల అణచివేతకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

**- దళిత నాయకుల అరెస్ట్‌పై మండిపడ్డ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గజ్జెల లక్ష్మణ్**

**- దళిత ఎమ్మెల్యేకు రక్షణ లేదని ఫైర్**

**- తెలంగాణ ఎమ్మార్పీస్ కరీంనగర్ జిల్లాధ్యక్షులు : గజ్జెల లక్ష్మణ్**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్ ) తుంగతుర్తి దళిత ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టేందుకు వచ్చిన దళిత సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలంగాణ ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్ విమర్శించారు.కరీంనగర్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యేకే భద్రత లేకుండా పోవడం బాధాకరమని, అలాంటి పరిస్థితుల్లో సామాన్య దళితుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గజ్జెల లక్ష్మణ్ వెల్లడించారు.

## నూతన సంకల్పాలతో కొత్త తెలుగు సంవత్సరాన్ని ఆరంభిద్దాం

**- సుభిక్షమైన సమాజ నిర్మాణమే లక్ష్యం**

**- జిల్లా ప్రజలందరికీ "ఉగాది పండుగ "శుభాకాంక్షలు**

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత :. అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అనుముల భాస్కర్ ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉగాది కొత్త సంవత్సరానికి ఆరంభమని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం నిండాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి దిశగా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మరింత పురోగతి సాధించవచ్చని తెలిపారు.అలాగే రైతులు మంచి పంటలు పండించి సుభిక్షంగా ఉండాలని, యువత మంచి అవకాశాలు అందిపుచ్చుకొని ఎదగాలని ఆకాంక్షించారు.ఉగాది పచ్చడి లాగానే జీవితం కూడా అన్ని రుచులతో నిండి ఉండాలని, ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ నూతన సంవత్సరంలో నీలోజిపల్లి గ్రామం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## మార్పుకు ఈ ' పరాభవ ' సుగమం పలకాలి.

**చందాయిపేట చేగుంట మండల అన్ని గ్రామాల ప్రజలకు తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు.**

**మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ మెదక్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.. ఈ ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతూ.. ఈ ఉగాది మీ కష్టాలకు ముగింపు మీ విజయాలకు ఆరంభం కావాలని కోరుకుంటూ. తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీ పరాభవ నామ సంవత్సరం లో ఆధ్యాత్మిక భావన పరిడ విల్లాలని మనలో మంచి మార్పుకు పరాభవ సుగమం పలకాలన్నారు ఈ సంవత్సరం అన్నిరంగాల్లోఈ యేటా వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. అన్నింటా శుభం జరగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కొత్త సంవత్సర పర్వదినం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు..

## ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి

**- జిల్లా ప్రజలందరికీ "ఉగాది పండుగ శుభాకాంక్షలు "**

**-భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (/ప్రశ్న న్యూస్ ) కరీంనగర్ జిల్లా ప్రజలకు భారతీయ జనతా పార్టీ చేనేత సెల్ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు, సీనియర్ జిల్లా నేత అనుమల్ల చంద్రమౌళి ఉగాది పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది పండుగ కొత్త ఆరంభాలకు, సంతోషాలకు, విజయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటా సిరిసంపదలు నిండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.తెలుగు ప్రజల సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుతూ ఉగాది పండుగను ఘనంగా జరుపుకోవాలని చంద్రమౌళి పిలుపునిచ్చారు.

## రంజాన్ పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం




వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రంజాన్ పండుగను పురస్కరించుకొని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేములవాడ ఎస్డీపీఓ శ్రీనివాసులు, పట్టణ సీఐ వీర ప్రసాద్,పట్టణ ఎస్ఐ ఎల్ల గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎటువంటి అపోహలు, వివాదాలు తలెత్తకుండా పరస్పరం సహకరించుకోవాలని కోరారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ముస్లిం మత పెద్దలు కూడా పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# శివస్వామి అలియాస్ శ్రీనివాస్ గుప్తపై రాష్ట్రీయ వానరసేన ఫిర్యాదు



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఈ రోజు ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్‌లో శివస్వామి అలియాస్ శ్రీనివాస్ గుప్తపై రాష్ట్రీయ వానరసేన సంస్థ సభ్యులు ఫిర్యాదు చేశారు.ఫిల్మ్ నగర్ హనుమాన్ ఆలయం విషయంలో బిల్డర్లతో చేసుకున్న అగ్రిమెంట్లను బయట పెట్టకుండా పదే పదే హిందూ సమాజాన్ని మోసం చేస్తూస్థానిక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయం నిర్మాణానికి సంబంధించిన హామీలను తప్పుదోవ పట్టిస్తూ అమలు చేయకపోవడం, ప్రజలను మోసం చేయడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.అలాగే, ఈ విషయంపై గతంలో కూడా ప్రశ్నించగా సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటూ, నిరసన వ్యక్తం చేసిన రాష్ట్రీయ వానరసేన సభ్యులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు.ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంస్థ డిమాండ్ చేసింది.

## కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలను ముందు నెరవేర్చాలి

### బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి




నిజామాబాద్(ప్రశ్న న్యూస్నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులు ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ ముట్టడి చేస్తామని అంటున్నారని బిజెపి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదు అని ముట్టడి చేస్తారా లేక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నందుకు ముట్టడి చేస్తున్నారా అని నగేష్ రెడ్డి అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు నల్లధనాన్ని బయటకు తీస్తామని ప్రతి పేదవాని అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పి ఇప్పటివరకు నల్లధనాన్ని బయటకు తీయనందుకు ముట్టడి చేస్తారని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు అని, స్థానిక ఎంపీ కేంద్రం నుండి నిజామాబాద్ జిల్లాకు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకో రాలేదని జిల్లా అభివృద్ధి గురించి ఎంపీ ఆలోచించిందే లేదు అని, మాధవ నగర్ బ్రిడ్జి గత ఏడు సంవత్సరాలుగా నత్తనడకన నడుస్తున్న స్థానిక ఎంపీ పట్టించుకున్న పాపాన లేదు అని నగేష్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ శేఖర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలు ఘనంగా

### సాంప్రదాయ వేదికగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) ముత్తంగి గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బుధవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను యువతరానికి తెలియజేసి నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి దోహదపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి .హెచ్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి ప్రాముఖ్యత, తెలుగు నూతన సంవత్సర విశిష్టత పై వివరణలు ఇస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

సాంప్రదాయ వేషధారణలో విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి విలువలను అలవరుచుకోవాలని, అదే నిజమైన విద్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొనగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తూ సహకరించారు. మొత్తం మీద ఈ వేడుకలు విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందించేలా విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ అనుముల భాస్కర్ కృషి

**- దోమల నివారణకు ఫాగింగ్ - పశువులకు టీకాల కార్యక్రమం నిర్వహణ**

**- ఆరోగ్యం - అభివృద్ధి పై సర్పంచ్ భాస్కర్ ప్రత్యేక దృష్టి సారింపు**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ అనుముల భాస్కర్ కృషి కొనసాగుతోంది. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పశుసంపద అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ క్రమంలో బుధవారం గ్రామంలో దోమల నివారణ దిశగా ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యగా ఫాగింగ్ యంత్రంతో గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలలో పిచికారీ చేయించారు.అదేవిధంగా గ్రామంలోని పాడి రైతుల సంక్షేమం దృష్ట్యా పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మధుమిత రెడ్డి ఆధ్వర్యంలో, పాడి రైతుల సమక్షంలో జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండటం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ఫాగింగ్ చేపట్టామని తెలిపారు. అలాగే పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అందుకే గాలి కుంటు వంటి వ్యాధులను అరికట్టేందుకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.
ఇలాంటి కార్యక్రమాలను గ్రామంలో నిరంతరం కొనసాగిస్తూ, ప్రజల సంక్షేమం,గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని భాస్కర్

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే పారిశ్రామికంగా మరింత పురోగతి

**ఆయిల్ పామ్ పరిశ్రమ సాధనే లక్ష్యంగా...**

**పట్టుదలతో ప్రభుత్వ సలహాదారు కృషి**

**అనువైన స్థలం కోసం కలెక్టర్ తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్ వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాను సాగు రంగంలో మరింతగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత రైతాంగానికి లాభాల సిరి అందించాలనే తాపత్రయంతో ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, బోధన్ శాసన సభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి తనదైన శైలిలో కృషి సాగిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక లాభాలను అందిస్తూ, అనేక ప్రయోజనాలు సమకూర్చే ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నిజామాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఇతర ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఆయిల్ పామ్ ఫాక్టరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు. స్థల పరిశీలన జరిపిన వారిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి

## సికింద్రాబాద్ వీధుల్లో 'సురక్షితాహారం' విప్లవం

**500 మంది విక్రేతలకు ఫుడ్ సేఫ్టీ ట్రేనింగ్ అండ్ సర్టిఫికేషన్ శిక్షణ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మన నగర వీధుల్లో దొరికే ఘుమఘుమలాడే స్ట్రీట్ ఫుడ్ అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అయితే, ఆ రుచికి 'సురక్షితం' అనే హామీ తోడైతే.? సరిగ్గా ఇదే లక్ష్యంతో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక అద్భుతమైన ముందడుగు పడింది. మంగళవారం సికింద్రాబాద్‌లో 500 మందికి పైగా వీధి ఆహార విక్రేతలకు ఫుడ్ సేఫ్టీ ట్రేనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ దక్షిణ ప్రాంత కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ, నగరంలో ఆరోగ్యకరమైన ఆహార సంస్కృతికి నాంది పలికింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ఆహారాన్ని విక్రయించే వారు కేవలం వ్యాపారులు మాత్రమే కాదని వేలాది మంది ప్రజలకు ఆహారాన్ని అందించే బాధ్యత కలిగిన వారన్నారు. ఆహారం విక్రయించే వ్యాపారులు పాటించే పరిశుభ్రత వల్ల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అనంతరం ఆహార భద్రతా నిపుణులు డా. అంజనేయులు చాగంటి మాట్లాడుతూ ఆహార విక్రేతలకు క్షేత్రస్థాయిలో అవసరమైన మెళకువలను నేర్పించారు. శిక్షణ అనంతరం శిక్షణ పొందిన మందికి ఫుడ్, హైజిన్ కిట్స్, ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ కధిరవన్ పలాని, ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలంగాణ డైరెక్టర్ బాలునాయక్ కేతవత్, ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలంగాణ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

**- ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుంది**

**- మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ** రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరవుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు.పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## సీఎం పదవి ఆఫర్ చేసిన జాతీయ పార్టీ.. తిరస్కరించిన టీవీకే చీఫ్ విజయ్

**చెన్నయ్** టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున అన్నారు. అయితే, అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు.అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం.

ఇటీవల పలు సందర్భా?ల్లో కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించారని అర్జున అన్నారు.అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బీజేపీయే అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. ఇటీవల విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే కూడా ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ టీవీకే ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలున్నాయి. విజయ్ తన పార్టీ అభ్యర్థుల జాబితాను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశాలున్నాయి. విజయ్ పెరంబూర్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన మరో కీలక నేత ఎన్ ఆనంద్ టీ నగర్ నుంచి, జనరల్ సెక్రెటరీ అధవ్ అర్జున విల్లివక్కం నుంచి పోటీ చేస్తారు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఎన్నిక జరగనుంది. మే 4న ఫలితాలుంటాయి

## ఈవీ కారుకు మంటలు, పేలిన గ్యాస్ సిలిండర్లు.. ఏడుగురు సజీవ దహనం

**భోపాల్** ఛార్జింగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈవీ కారుకు మంటలు రాజుకున్నాయి. ఆ వాహనం నుంచి బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ఒక ఇంట్లో ఉంచిన గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ నేపథ్యంలో మంటల్లో కాలిపోయి ఏడుగురు సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురికి తీవ్ర కాలిన గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇండోర్‌లోని బెంగాలీ స్క్వేర్ సమీపంలోని ఒక బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం జరిగింది.

పుగాలియా కుటుంబానికి చెందిన బిల్డింగ్ సెల్లార్‌లో ఉన్న ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ) ఛార్జింగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆ కారులో మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే మూడు అంతస్తుల నివాస భవనమంతా మంటలు వ్యాపించాయి.కాగా, ఆ బిల్డింగ్‌లోని ఒక ఇంట్లో 12కు పైగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచారు. మంటలు వాటికి వ్యాపించాయి. సుమారు నాలుగు గ్యాస్ సిలిండర్లు వరుసగా పేలాయి. గ్యాస్ సిలిండర్ల పేలుడు ధాటికి ఆ ప్రాంతం స్వల్పంగా కంపించింది.పేలుళ్ల తీవ్రత వల్ల భవనంలో కొంత భాగం కూలిపోయింది. గ్యాస్ సిలిండర్ల పేలుళ్ల శబ్దానికి స్థానికులు భయాందోళన చెందారు.మరోవైపు మంటలు చెలరేగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ డోర్ లాక్ అయ్యింది.

ఈ నేపథ్యంలో సహాయక చర్యలు క్లిష్టమయ్యాయి. ఆ ఇంట్లో నివసించేవారు లోపల చిక్కుకుపోయారు. మంటల్లో కాలి ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ముగ్గురిని స్థానికులు కాపాడారు. కాలిన గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ అగ్ని ప్రమాదం గురించి తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ ఇంటికి వచ్చిన బంధువులు రాత్రివేళ అక్కడ బస చేసిన సమయంలో ఈ విషాదం జరిగింది. ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమైనట్లు ఇండోర్ కలెక్టర్, ఎస్పీ తెలిపారు. సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# జడప్రాయమైన జగత్తులో నూతనాశయాలను
# అంకురింపచేసే శుభదినం ఉగాది

**- సనాతన ధర్మంలో జ్యోతిష్య శాస్త్ర ప్రకారంగా మనం జరుపుకునే మొదటి పండుగ ఉగాది.**

ఉగాది అంటే గుర్తుకు వచ్చేది తెలుగు నూతన సంవత్సరం. తెలుగు నూతన సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి తెలుగు వారికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న పండుగ ఉగాది. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈ పర్విదినానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ నూతన సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు జరిపించుకొని సుఖ సంతోషాలతో ఉండేందుకు పంచంగ శ్రవణాన్ని చేస్తారు.



### ఉగాది విశిష్టత, చరిత్ర

యుగం అంటే రెండు లేక జంట అని అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనం అనబడే ఆయన ద్వయ సంయుతమే యుగం కాగా ఈ యుగానికి అది యుగాది అదే సంవత్సరాది. ఉగాది, వసంతాలకు గల అవినవభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు పాత్ర, సాయం కాలాది, త్రికాలములకు ఉషాదేవతాయే మాతృస్వరూపం. భారతీయ సాంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి ఉగాది రోజునే బ్రహ్మ సృష్టి ఆరంభించాడని పురాణాలు చెబుతున్నాయి.

### ఉగాది వెనుక పురాణగాథ

హిందూ సంప్రదాయం ప్రకారం ప్రతి పండుగ వెనుక ఒక పౌరాణిక గాథ ఉంటుంది. సృష్టి ఆరంభానికి ముందు సోమకుడు అనే రాక్షసుడు వేదాలను అపహరించడంతో బ్రహ్మదేవుని సృష్టి కార్యానికి ఆటంకం కలిగింది. అప్పుడు శ్రీ మహావిష్ణువు సోమకుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించాడు. అనంతరం బ్రహ్మ చైత్ర శుద్ధ పాడ్యమి రోజు సృష్టిని ఆరంభించాడని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆనాటి నుంచి చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగ జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఉగాది రోజు ముందు బ్రహ్మదేవుని పూజించి తరువాత ఇష్టదైవాన్ని ఆరాధించాలని శాస్త్రం చెబుతోంది. ఉగాది పండుగతో సంవత్సరం ఆరంభమవుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఇదిలావుండగా పురాణాల ప్రకారం శ్రీరాముడు చైత్ర శుద్ధ పాడ్యమి రోజునే లంక నుంచి అయోధ్యకు తిరుగు ప్రయాణమైనట్లుగా వాల్మీకి రామాయణం ద్వారా తెలుస్తోంది. ఈ ప్రకారంగా చూస్తే సత్య-త్రేతా యుగాలతో ముడిపడిన దసరా, ద్వాపర యుగంతో ముడిపడిన దీపావళి కంటే ఉగాది అతి ప్రాచీనమైన పండుగ అని తెలుస్తోంది. ఉగాది రోజు సూర్యోదయానికి ముందే అభ్యంగన స్నానం చేయాలని, దీనితో శరీరానికి పట్టిన మురికితో పాటు మనసుకు పట్టిన కల్మషం వదలుతుందని పెద్దలు అంటారు. ఉగాది రోజు తప్పకుండా నూతన వస్త్రాలు ధరించాలి. నూతన వస్త్రధారణ అంటే గతంలోని కీడును తొలగించుకుని నూతన నవ్యమార్గంలోకి ప్రవేశించడం. అనంతరం ఇంటికి మామిడి తోరణాలు కట్టి, కుల దైవాన్ని, ఇష్ట దైవాన్ని ఆరాధించాలి. దైవారాధనతో ఇంట్లో సానుకూల శక్తులు ప్రవేశిస్తాయి. మానసిక ప్రశాంతత కలుగుతుంది. తరువాత దేవునికి నివేదించిన ఉగాది పచ్చడిని కుటుంబంతో కలిసి స్వీకరించాలి.

### ఉగాది పచ్చడి విశిష్టత

ఉగాది ప్రత్యేకత అంతా ఉగాది పచ్చడి లోనే ఉంది. ఉగాది పచ్చడిలో దాగివుండే షడ్రుచుల సమ్మేళనంలోనే సంవత్సరాది సారమంతా నిండి ఉంది. వేపపువ్వు, కొత్త బెల్లం, చింతపండు, మామిడికాయ, ఉప్పు కారం సమ్మేళనమే ఉగాది పచ్చడి. ఈ ఉగాది పచ్చడి జీవితంలో వచ్చే ఆటుపోట్లు, కష్టసుఖాలు సమానంగా స్వీకరిస్తూ ముందుకు వెళ్లాలనే సందేశంతో పాటు ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి ప్రకృతిలో వచ్చే మార్పులకు శరీరాన్ని సిద్ధం చేస్తుంది.

### పంచాంగ శ్రవణం

ఉగాది నాటి సాయంత్రం అన్ని ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం. ఈ ఐదింటిని కలిపి పంచాంగం అంటారు. ఈ రోజు ప్రతి ఒక్కరు పంచాంగ శ్రవణం తప్పకుండా చేయాలి. ఇందులో కొత్త సంవత్సరంలో పంటలు ఎలా పండుతాయి, వర్షాలు ఎలా కురుస్తాయి, వర్తక వాణిజ్యాలు ఎలా ఉంటాయి అనే వివరాలతో పాటు వ్యక్తిగత రాశి ఫలాలు కూడా ఉంటాయి. ఈ విధంగా రానున్న రోజుల్లో ఏమి జరగనుందో ముందుగా తెలుసుకుని తదనుగుణంగా భగవంతుని పూజిస్తూ తగిన పరిహారాలు చేసుకోవడం ఉగాది పండగలోని ప్రధాన ఘట్టం.

### వసంత నవరాత్రులు

ఉగాది నుంచి వసంత నవరాత్రులు ప్రారంభం అవుతాయి. వసంత నవరాత్రులలో ఆధ్యాత్మిక సాధకులు ఉపవాసం ఉంటే రామాయణాది గ్రంథాలు పారాయణ చేయడం ఒక ఆచారంగా పాటిస్తారు. నవరాత్రులలో చివరి రోజైన శ్రీరామనవమి రోజు శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడంతో వసంత నవరాత్రులు ముగుస్తాయి. ఇలా ఎన్నో విశేషాల సమాహారమే ఉగాది పండుగ. ఉగాది పండుగను ఘనంగా జరుపుకోవడమే కాకుండా పండుగ చరిత్ర, విశిష్టత, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గుర్తించాలి.

పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగ శుభాకాంక్షలతో
రవికుమార్ సంతోజు
బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)

# ప్రకృతి పలకరింపు.. నవ వసంతం ఆరంభం

**తెలుగువారి లోగిళ్లలో కొత్త వెలుగులు నింపే పండుగ ఉగాది. ఇది కేవలం తిథి మార్పు కాదు, ప్రకృతి చేసే ఒక అద్భుతమైన విన్యాసం. శిశిరంలో ఆకులు రాల్చిన చెట్లు, వసంతంలో పచ్చని కోక కట్టుకుని కొత్తగా తయారయ్యే 'ప్రకృతి పుట్టినరోజు' ఈ ఉగాది.**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ఖగోళ రహస్యం భారతీయ కాలగణన ప్రకారం ఉగాదికి ఎంతో శాస్త్రీయత ఉంది. సూర్యుడు భూమధ్యరేఖను దాటి ఉత్తరాయణంలోకి ప్రవేశించి, రాశి చక్రంలో మొదటిదైన 'మేష రాశి' లోకి ప్రవేశించే కాలం ఇది. పగలు, రాత్రి సమానంగా ఉండి, వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. అందుకే ఇది కేవలం నమ్మకం కాదు, ఒక ఖగోళ సత్యం.





### షడ్రుచుల సమ్మేళనం..

జీవితానికి ఒక దిక్సూచి మీరు పేర్కొన్నట్లుగా ఉగాది పచ్చడి జీవిత పరమార్థానికి ప్రతిరూపం. అయితే ఇందులో ఒక ఆరోగ్య సూత్రం కూడా దాగి ఉంది.

### వేపపువ్వు..

శీతాకాలం ముగిసి ఎండలు మొదలయ్యే సమయంలో వచ్చే చర్మవ్యాధులను, క్రిములను అరికట్టే అద్భుతమైన యాంటీబయాటిక్.




### మామిడి, చింతపండు..

ఇవి శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తాయి.

### పంచాంగ శ్రవణం..

భవిష్యత్తుపై భరోసా ఉగాది నాడు దేవాలయాల్లో లేదా గ్రామ రచ్చబండల దగ్గర పండితులు 'పంచాంగ పఠనం' చేస్తారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలనే ఐదు అంగాల (పంచాంగం) గురించి తెలుసుకోవడం వల్ల ఐశ్వర్యం, ఆయుష్షు పెరుగుతాయని నమ్మకం. ఆదాయ-వ్యయాలు, రాజపూజ్య-అవమానాలు తెలుసుకోవడం వల్ల రాబోయే కష్టాలకు ధైర్యంగా, సుఖాలకు వినయంగా ఉండాలనే మానసిక సన్నద్ధత కలుగుతుంది.

### కవి సమ్మేళనాలు..

తెలుగు భాషా ఉత్సవం ఉగాది అంటే సాహితీ ప్రియులకు పండుగ. ఈ రోజున రాష్ట్రవ్యాప్తంగా కవి సమ్మేళనాలు జరుగుతాయి. కొత్తగా రాసే కవుల నుంచి దిగ్గజాల వరకు తమ కవితలతో, పదాల గారడీతో తెలుగు భాషా మాధుర్యాన్ని పంచుతారు. అక్షర రూపంలో కొత్త ఏడాదికి స్వాగతం పలికే సంప్రదాయం ఇది.

### సంప్రదాయం - సంస్కృతి..

తైలాభ్యంగన స్నానం సూర్యోదయానికి ముందే ఒంటికి నూనె రాసుకుని స్నానం చేయడం వల్ల కొత్త ఉత్సాహం వస్తుంది. ఇంటి గుమ్మానికి పచ్చని మామిడి ఆకులు, వేప రెమ్మలతో తోరణాలు కట్టి, లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతారు. ఉగాది పచ్చడితో పాటు బొబ్బట్లు (పూర్ణ భక్ష్యాలు) ఈ పండుగ ప్రత్యేకత. తీపిని పంచుతూ ఏడాదిని తీపిగా మొదలుపెట్టడం దీని ఉద్దేశ్యం.

## కారు ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ తో పాటు ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ బండల్ వద్ద మెదక్ హైదరాబాద్ హైవే పై రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యూనూస్ (60)బట్ట కిష్టయ్య (58) మెదక్ నుంచి పోతంశెట్టిపల్లి కి వస్తున్నారు.అదే సమయంలో మెదక్ వైపు వస్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో ఎగిరిపడి అందులో ఉన్న డ్రైవర్ యూనుస్ పాటు ప్రయాణికులు బట్టకిష్టయ్య ఆటోలో నుంచి ఎగిరి రోడ్డుపై పడారు. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు వారిని 108 లో మెదక్ లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం చేసిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

## రేవంత్, ఉత్తమ్ రెడ్డీలు ఆంధ్రాకు తెలంగాణను తాకట్టు పెట్టారు

**- వేములవాడ రాజ్ కుమార్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆంధ్రాకు దాసోహమై తెలంగాణను చంద్రబాబుకు తాకట్టు పెట్టారంటూ ప్రజా సైన్యం పార్టీ అధ్యక్షులు వేములవాడ రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తున్నదంటూ మండిపడ్డారు. గోదావరి, బనకచర్లపై ఢిల్లీ మీటింగ్ మినిట్స్ వచ్చి నెల దాటినా అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని, లేఖల డ్రామాలు కట్టిపెట్టాలంటూ హితవుపలికారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణను ఒక ఏటీఎంగా మార్చి ఏఐసీసీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ, రేవంత్ రెడ్డికి రైతుల మీద, పేదల మీద లేదన్నారు. అందుకే తప్పకుండా ప్రతీ పేదవాడి తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిగ్గదీస్తాం, నిలదీస్తామంటూ హెచ్చరించారు.

## ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

**- గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకున్న నౌక**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను ఫుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది.మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

## అక్రమ గ్యాస్ రీఫిలింగ్ సెంటర్‌పై సివిల్ సప్లై అధికారుల దాడులు

**- 201 అక్రమ సిలిండర్ స్వాధీనం నిర్వహణపై కేసు నమోదు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రంగారెడ్డి జిల్లా కాళీ మందిర్ దగ్గర గ్యాస్ రీఫిలింగ్ గోడౌన్ పై రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ వనజాతరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణ దాడులు చేశారు. ఇందులో 201 సిలిండర్లు సిజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారి వనజాతారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పరిధిలో అక్రమ సిలిండర్లు కానీ రేషన్ బియ్యం కానీ ఎవరైనా సరఫరా చేసిన నిలువ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్యాస్ అక్రమ రి ఫీలింగ్ సెంటర్ నిర్వాహకుడు దిపేష సింగ్ పై కేసు నమోదు చేశారు.

## పశ్చిమాసియా నుంచి సురక్షితంగా

# 2.6 లక్షల భారతీయులు

**- వెల్లడించిన విదేశాంగ శాఖ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా నుంచి ఇప్పటి వరకు 2.6 లక్షల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాలో 19 రోజులుగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని భారతీయులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి రప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో రెండు లక్షలకు పైగా భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చింది. యూఏఈ నుంచి భారత్‌లోని వివిధ విమానాశ్రయాలకు 70 సర్వీసులు నడుస్తున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి మన పౌరులు, విద్యార్థులకు సహాయం అందిస్తోందని వెల్లడించింది. చాలామంది భారతీయులు ఇరాన్ సరిహద్దు దాటి అర్మేనియా, అజర్‌బైజాన్‌లకు వెళ్లాలని భావిస్తున్నారని తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. కువైట్‌పై దాడులను భారత్ ఖండిస్తున్నట్లు తెలిపారు. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా వెళ్లేలా చూడాలని అన్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి నిరంతరం దౌత్య చర్చలు అవసరమని పేర్కొన్నారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహకు అవమానం.?

**- సీఎం సెక్యూరిటీ ఓవరాక్షన్ పై ఆయన ఆగ్రహం**

**- సెక్యూరిటీ సిస్టం సీఎం ఇమేజ్ ని డామేజ్ చేస్తుందా.?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మండలి కొత్త భవనంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దామోదర్ రాజనరసింహ కు ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది అడ్డంకులు సృష్టించడం అవమానకరంగా భావిస్తున్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణించే మార్గం భద్రతా కారణాల వల్ల వేరుగా ఉంచినట్లు సెక్యూరిటీ సిబ్బంది పేర్కొంటూ, మంత్రి దామోదర్ రాజనరసింహను మరో మార్గం ద్వారా వెళ్లాలని సూచించారు. అయితే, తాను మంత్రి అని చెబుతూ తనను ఆపడం పట్ల దామోదర్ రాజనరసింహ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. "నేను మినిస్టర్‌ను, నన్ను ఆపుతారా.?" అంటూ సెక్యూరిటీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మండలి లోపలికి వెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనలో మంత్రి వెంట రామచంద్రు నాయక్ కూడా ఉన్నారని భద్రతా సిబ్బంది ప్రవర్తనపై ఆయన కూడా అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సంఘటనపై రాజకీయ వర్గాల్లో కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి భద్రత పేరుతో మంత్రులను కూడా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం.? అదే సమయంలో ఈ తరహా ఓవరాక్షన్ సాధారణ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తిగా సమాచారం లేకుండానే కొంతమంది సిబ్బంది అధికంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇమేజ్‌కు డ్యామేజ్ కలగడమే కాకుండా మంత్రులు, ప్రజల మధ్య దూరం పెరిగే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఘటనపై అధికారిక వివరణ రావాల్సి ఉంది. భద్రతా నిబంధనలు ఎంత ముఖ్యమో, ప్రజాప్రతినిధుల గౌరవం కూడా అంతే ముఖ్యమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రీల్స్ కోసం బెంగళూరు లో ఓ కూతురు

# తన తండ్రి ప్రాణాలతో చెలగాటం

**- తండ్రిని గోనె సంచిలో కుక్కి కొరియర్ చేయబోయిన కూతురు**

**- బస్తాలో ఏదో కదులుతున్నట్లు సిబ్బంది గమనించిన సిబ్బంది**

**- పోలీసులకు పిర్యాదు.. యువతిని అదుపులోకి తీసుకుని పోలీసులు**

**బెంగళూరు** రీల్స్ కోసం బెంగళూరు లో ఓ కూతురు తన తండ్రి ప్రాణాలతో చెలగాటం ఆడింది. ప్రయాణానికి బస్సు టికెట్లు దొరక్కపోతే పడే ఇబ్బందులను చెప్పడానికి.. తన తండ్రిని గోనె సంచిలో కుక్కి కొరియర్ చేయబోయింది. కానీ గోనె సంచిలో ఏదో కదులుతున్నట్లు సిబ్బంది గమనించడంతో విషయం బయటపడింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్ ప్రాంతంలో నివసించే ఓ యువతి.. తన తండ్రిని పెద్ద బస్తాలో కుక్కింది. ఆ తర్వాత బస్తాకు దారం గట్టి.. ఓ ప్రైవేటు కొరియర్ సంస్థకు కాల్ చేసింది. తన వద్దర భారీ పార్సిల్ ఉందని డెలివరీ చేయాలని కోరారు. దీంతో యువతి ఇంటికి చేరుకున్న కొరియర్ సిబ్బంది బస్తాను నేరుగా కొరియర్ ఆఫీసుకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో బస్తాలో ఏదో కదులుతున్నట్లు సిబ్బంది గమనించారు. దీంతో ఆఫీసుకు వచ్చాక బస్తాను తెరవాలని యువతిని కోరారు. అందుకు ఆమె నిరాకరించడంతో స్వయంగా సిబ్బంది గోనె సంచిని తెరిచి చూడగా.. అందులో ఓ వ్యక్తి కనిపించాడు. ఈ వ్యవహారంపై పోలీసులకు కొరియర్ సిబ్బంది సమాచారం అందించారు. కొరియర్ ఆఫీసుకు వచ్చిన పోలీసులు.. గోనె సంచిలోని వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సదరు యువతిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. కేవలం రీల్స్ కోసమే ఈ పనిచేశానని తెలిపింది. దీంతో సదరు కుటుంబానికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. ఈ క్రమంలో క్షమాపణలు చెబుతూ యువతి ఓ వీడియో చేసింది. ఉగాది, రంజాన్ వంటి పండుగల సమయంలో బస్సు టికెట్లు తరచుగా అందుబాటులో ఉండవు. ఆ సమయంలో ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేయడానికే ఈ వీడియో చేశానని యువతవి అందులో పేర్కొన్నారు. అందులో సదరు యువతి, ఆమె అత్త, భర్త ఉన్నారు.

# ఎవరికీ బినామీని కాను.. వైఎస్ విజయమ్మ

వైఎస్ కుటుంబంలో ఆస్తుల పంపిణీ వివాదం మరింత ముదిరి న్యాయస్థానాలకు చేరింది. తాను తన కుమార్తె వైఎస్ షర్మిలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నానంటూ వస్తున్న ఆరోపణలను వైఎస్ విజయమ్మ తీవ్రంగా ఖండించారు. తాను ఎవరికీ బినామీని కాదని, స్వతంత్రంగానే నిర్ణయాలు తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. చెన్నైలోని నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ బెంచ్కు ఆమె కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. జగన్ మోహన్ రెడ్డి, భారతి రెడ్డి తనకు ప్రేమతో ఇచ్చిన గిఫ్ట్ డీడ్ వాస్తవమేనని విజయమ్మ తన కౌంటర్లో పేర్కొన్నారు. క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ వాటాలను కూడా తగిన ప్రతిఫలం చెల్లించే కొనుగోలు చేశానని, ఈ ఒప్పంద పత్రాలను ఎవరూ కాదనలేరని తెలిపారు. ఒప్పందం ప్రకారం వాటా సర్టిఫికెట్లు, బదిలీ పత్రాలు తనకు అందజేసినప్పుడే కంపెనీలో వారి పాత్ర ముగిసిపోయిందని ఆమె వాదించారు. ఈడీ జప్తులో ఉన్న వాటాలను బదిలీ చేయకూడదన్న జగన్ వాదన కేవలం ఓ రాజకీయ ఎత్తుగడ మాత్రమేనని విజయమ్మ కొట్టిపారేశారు. సండూర్ పవర్ వాటాలను తనకు బదిలీ చేశాకే ఈడీ జప్తు చేసిందని, అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని ఆమె ప్రశ్నించారు

## మంచినీటి సమస్యను తీర్చాలని

# కమిషనర్‌కి వినతి



**వనపర్తి.** వనపర్తి పట్టణములో మరి ముఖ్యంగా 19వార్డులో గత వారం రోజులుగా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొన్నదని అధికారులను సంప్రదిస్తే కరెంట్ సమస్య,లీకేజీల సమస్య వల్ల ఆలస్యం జరుగుతుందని చెబుతున్నారని వెంటనే అధికారులకు ఆదేశాలు ఇచ్చి మంచినీరు సక్రమంగా అందించాలని 19వార్డు కౌన్సిలర్ మురళీ సాగర్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది,రంజాన్ పండుగలు ఒకేసారి రావడం జరుగుతుంది అని ఇటువంటి సమయములో మంచి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వికలాంగులకు ఉచిత బస్సు దివ్యాంగ్ శక్తి పథకాన్ని ప్రారంభించిన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు** పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నందు వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించిన పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి.ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో ఇది ఒకటి అమలు చేసినట్టు తెలిపారు. దివ్యాంగ శక్తి పథకం 40 శాతం వైకల్యం ఉన్నవారు ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చున్నారు

ఆంధ్రప్రదేశ్ అంతా సుమారు 11.16 లక్షల మందికి పైగా దివ్యాంగులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగుల చలానాశీలతను పెంపొందించడం మరియు వారి సామాజిక భాగస్వామ్యాన్ని పెంచడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలియజేశారు. అనంతరం బస్సులో ప్రయాణించి వచ్చిన దివ్యాంగులకు అన్నదాన చేశారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి

# అందరూ సహకరించాలి

నియోజకవర్గ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 2026 ప్రక్రియకు గాను అన్నీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూతు లెవెల్ ఎజెంట్లను నియమించి సదరు జాబితా ను ఆఫీసుకు ఈ వారం లోపు సమర్పించాలని ఆధేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. 2025 జాబితాలోని ఓటర్లను 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ చేయు నిమిత్తం అందరూ బూత్ లెవెల్ అధికారులు, సూపెర్వైజర్స్,గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి మ్యాపింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు

# ఐదేళ్ల జైలు శిక్ష

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (ఖీూయాఱఈ) కఠిన చర్యలు అమలు చేస్తోంది. గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 14/2017 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల అటవీ పరిధిలోని చామల రేంజ్ లో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు, కృష్ణగిరి జిల్లా కు చెందిన సాదిక్ బాషా, గణేషన్ కాగా వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న టాస్క్ ఫోర్స్ దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## "దివ్యాంగ శక్తి" ఆత్మగౌరవ జీవన బలం



**రాయచోటి** దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగుల పాలిట ఆత్మగౌరవ జీవనానికి తొలి అడుగని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం రాయచోటిలో మంత్రి దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రదివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం ? ఆత్మగౌరవ జీవనానికి బలమైన అడుగు. సంక్షేమానికి సరికొత్త రూపం... ప్రతి దివ్యాంగుడికి స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు. ఆర్టీసీ బస్టాండ్ నందు జరిగిన సమాన అవకాశాలతో ముందుకు సాగే సమాజం నిర్మాణం "దివ్యాంగ శక్తి" నమ్మకానికి, స్వావలంబనకు, గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నందలి దివ్యాంగ సోదర,సోదరీమణులు,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు,సంబంధిత అధికారులు,బూత్,యూనిట్, క్లస్టర్ ఇన్చార్జులు, మండల పార్టీ,గ్రామ పార్టీ అధ్యక్షులు, టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారఅన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలంలో టిడిపి అభిమాని రెడ్డి శేఖర్ నూతనంగా నిర్మించిన మిస్టర్ చాయ్ టీ స్టాల్ ఉ కాఫీ రెస్టారెంట్ ను రాష్ట్ర రవాణా, యువజన ఉ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానికి అభినందనలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెంది మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డైరెక్టర్ రెడ్డయ్య యాదవ్, టిడిపి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, వినోద్ రెడ్డి మరియు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లి లో మంత్రి గారి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ నిర్వహించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి . ఈ సందర్భంగా ప్రజల సమస్యలు,అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్యాలువ పుష్పగుచ్ఛములతో మంత్రిని సత్కరించినారు.

## పిడుగురాళ్లలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు**




**పిడుగురాళ్ల,** రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న కానుక "దివ్యాంగ శక్తి" (40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు రాష్ట్రమంతటా ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, వెంట వచ్చే సహాయకులకు ఛార్జీల్లో 50 శాతం రాయితీ) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గుంటూరు బస్ స్టాండ్ నందు ప్రారంభించిన సందర్భంగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టాండ్ నందు నిర్వహించిన "దివ్యాంగ శక్తి" పథకం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు ఆర్డీవో మురళీకృష్ణ, గురజాల నియోజకవర్గ పరిశీలకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, పిడుగురాళ్ల తహసిల్దార్ మధుబాబు, పిడుగురాళ్ల పట్టణం మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాసరావు, గురజాల టౌన్ మున్సిపల్ కమిషనర్ వై వి ఎల్ శివన్నారాయణ మరియు గురజాల నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కలసి ఏపీఎస్ఆర్టీసీ బస్ డిపో నుండి కొండమోడు వరకు, తిరిగి కొండమోడు నుండి ఏపీఎస్ఆర్టీసీ బస్ డిపో వరకు యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు, దివ్యాంగులు ప్రయాణం చేశారు.

## వనపర్తి పోలీసు క్రికెట్ జట్టుకు

# జెర్సీలను అందజేసిన జిల్లా ఎస్పీ

**వనపర్తి** .పోలీసులు కేవలం విధుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం అభినందనీయమని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. అన్నారు. బుధవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తి నివాసి, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు, పవర్ గ్రిడ్ రిటైర్డ్ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ మేనేజర్ అహ్మద్ బిన్ మహమ్మద్ సహకారంతో వనపర్తి జిల్లా పోలీసు క్రికెట్ జట్టుకు స్పాన్సర్ చేసిన జెర్సీలు, క్యాప్‌లు (క్రికెట్ జట్టు డ్రస్ కోడ్)ను జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ చేతుల మీదుగా పోలీసు క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, విధుల్లో మరింత సమర్థతకు దోహదపడతాయని పోలీసు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అహ్మద్ బిన్ మహమ్మద్ ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. స్పాన్సర్ చేసిన జెర్సీలు, క్యాప్‌లతో పోలీస్ క్రికెట్ జట్టు మరింత ఉత్సాహంతో ప్రతిభ చూపుతారని ఎస్పీ అన్నారు ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి సీఐ, రత్నం, సిసిఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీస్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు

## తమిళనాడు ఎన్నికల బిజెపి ఎస్సీ మోర్చా కో-ఇంచార్జ్ గా 'ఎస్. కుమార్' నియామకం



**హైదరాబాద్** ;భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న 'శ్రీ ఎస్. కుమార్' గారికి పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని, ఆ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎన్నికల సహ–ప్రభారీ (కో–ఇంచార్జ్) గా ఆయనను నియమిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళం రాష్ట్రాలకు కూడా ఎస్సీ మోర్చా తరపున ప్రభారీలను, సహ–ప్రభారీలను నియమించారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి ప్రభారీగా శ్రీ శంభునాథ్ తుండియా గారిని, సహ–ప్రభారీలుగా ఎస్. కుమార్ ని మరియు ఎస్. మునిస్వామి (మాజీ ఎంపీ) గారిని నియమించారు. ఎస్. కుమార్ గత కొంతకాలంగా ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన పార్టీ నాయకత్వం, తమిళనాడు ఎన్నికల్లో ఓటర్లను సమన్వయం చేసుకుంటూ, పార్టీ విజయానికి వ్యూహరచన చేసేందుకు ఈ కీలక బాధ్యతను కట్టబెట్టింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి ఎస్. కుమార్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన ఆశయాలతో తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం

**- బోయినిపల్లి గ్రామ,మండల ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు**

**- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్ సందేశం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్ర గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ గ్రామ, బోయినిపల్లి మండల ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ…"ఉగాది మన తెలుగు వారి కొత్త సంవత్సరానికి ఆరంభం. ఈ పండుగ ప్రతి కుటుంబంలో సంతోషం, ఆనందం నింపాలని కోరుకుంటున్నాను. గత సంవత్సరంలో ఎదురైన కష్టాలను మర్చిపోయి, కొత్త ఆశయాలతో ముందుకు సాగుదాం.గ్రామ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించగలం. ప్రతి ఇంటిలో ఆరోగ్యం, సుఖసంతోషాలు నెలకొని, రైతులు, యువత, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆశిస్తున్నాను.మన గ్రామం మరింత అభివృద్ధి చెందేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరుతున్నాను" అని అన్నారు.

## కోర్టులో దొంగతనం కేసులో

# నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) కోర్టు ఆస్తి దొంగతనం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, 13-10-2025న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రాంగణంలోని కోర్టు హాల్‌లో ఉన్న టవర్ ఎయిర్ కండిషనర్ అవుట్‌డోర్ యూనిట్‌కు చెందిన రాగి వైర్‌ను దొంగిలించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్. సూర్యనారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు బహదూర్ సింగ్‌గా గుర్తించి, అతనిపై కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ నరేష్ సాక్షులను కోర్టు ముందుకు హాజరుపరిచారు. కేసులోని సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడు బహదూర్ సింగ్‌ను దోషిగా తేల్చి మూడేళ్ల జైలు శిక్ష విధించారు.

# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

**- వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, మహిళా సంఘాలకు, ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయాలి**

**- డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య, ఇతర రుణాల లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ ల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆర్ సేథీ ఆధ్వర్యంలో ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. వివిధ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని, స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలపై సమీక్ష చేశారు. మహిళలు తీసుకుంటున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ ఎం రాజ నరేంద్ర, డీఆర్డీఓ గీత, డీ వీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, డీ ఏ ఓ అఫ్జల్ బేగం, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అరుణ్ కుమార్ త్యాగీకి ఘన సన్మానం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలు 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మెయిన్ హాల్‌లో నిర్వహించబడింది. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్, కాప్రా మండలం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు చెందిన సామాజిక సేవకుడు అరుణ్ కుమార్ త్యాగీ ని ప్రత్యేకంగా సన్మానించారు. సమాజ సేవలో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ ఈటీవీ ప్రతినిధులు ఆయనకు పురస్కారం అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరై విజేతలను అభినందించారు. కళా, సాంస్కృతిక రంగాలకు విశేషంగా సేవలందిస్తున్న మయూరి ఆర్ట్స్ సంస్థ నిర్వహించిన ఈ వేడుక ప్రేక్షకులను ఆకట్టుకుంది.అరుణ్ కుమార్ త్యాగీ గత కొంతకాలంగా సమాజ సేవ, యువతకు మార్గదర్శకత్వం, మరియు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ విశేష గుర్తింపు పొందుతున్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు అందించడం గర్వకారణమని స్థానికులు తెలిపారు.ఈ సందర్భంగా అరుణ్ కుమార్ త్యాగీ మాట్లాడుతూఈ గౌరవం నాకు మరింత బాధ్యతను పెంచింది. సమాజానికి ఇంకా మంచి సేవ చేయడానికి కృషి చేస్తాను అని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభను ప్రోత్సహిస్తూ, సమాజానికి సేవ చేసే వ్యక్తులను గౌరవించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

## సింగరేణి సంస్థను కాపాడండి

# ఏఐటీయూసీ ఆవేదనాత్మక లేఖ

**- ఆర్థిక బలోపేతం కోసం యాజమాన్యానికి కార్మికుల వినతి**

**- జెన్ కో, ట్రాన్స్ కో బకాయిల వసూలుపై గట్టిగా డిమాండ్**

**- వకీల్ పల్లిలో అండర్ మేనేజర్ రవీందర్ రెడ్డికి వినతి అందజేత**



**రామగుండం (ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా--2 పరిధిలో సింగరేణి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించింది. వకీల్‌పల్లి గని అండర్ మేనేజర్‌కు ఈ వినతిపత్రాన్ని అందజేసిన సంఘం ప్రతినిధులు, సంస్థ భవిష్యత్తు కోసం తక్షణ చర్యలు అవసరమని స్పష్టం చేశారు.సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం పరస్పర సంబంధమని పేర్కొంటూ, గుర్తింపు సంఘం తరపున సీఎండీకి లేఖ పంపినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను ఇకపై ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, సాంబమూర్తి సూచనల మేరకు తయారు చేసిన లేఖను మైన్ అండర్ మేనేజర్‌కు అందజేసి, అన్ని గనుల అండర్ మేనేజర్‌ల ద్వారా సీఎండీ దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు.

### ఆర్థిక బలోపేతం -- కీలక డిమాండ్లు..

సంస్థ ఆర్థిక స్థితిని మెరుగుపర్చేందుకు ఏఐటీయూసీ పలు కీలక అంశాలను ప్రస్తావించింది. సైనీ బ్లాక్‌లో ఉన్న సుమారు 70,000 టన్నుల బొగ్గు నిల్వలను వెంటనే రవాణా చేయాలని, అలాగే జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి రావలసిన రూ.51 వేల కోట్ల బకాయిలను తక్షణమే వసూలు చేయాలని డిమాండ్ చేసింది.కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపులో సింగరేణి సంస్థ చురుకుగా పాల్గొని పీకే ఏసీ--2, తాడిచెర్ల కోల్ బ్లాక్-××, కోయగూడెం రాజ-3, సత్తుపల్లి-3, శ్రావణపల్లి వంటి ప్రాజెక్టులను సంస్థకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే మణుగూరు ఓపెన్ కాస్ట్, జేకే-5 ఎక్స్టెన్షన్, పీవీఎన్ ఆర్ ఓసీపీ వంటి పాత ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సూచించింది.

### ఉత్పత్తి పెంపు, సొంత నిర్వహణకు ప్రాధాన్యం..

బెల్లంపల్లి శాంతిఖని గనిలో ఉత్పత్తి నిలిచిపోవడం ఆందోళనకరమని పేర్కొంటూ, కాంట్రాక్టర్లపై ఆధారపడకుండా సంస్థ స్వయంగా నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్ని ఓపెన్ కాస్ట్ గనుల్లో పర్మనెంట్ కార్మికుల ద్వారానే ఉత్పత్తి జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆధునిక పరికరాల అవసరంఓపెన్ కాస్ట్ గనులకు అవసరమైన హెచ్'ఈఎంఎం యంత్రాలు, అండర్ గ్రౌండ్ గనులకు ఎల్ హెచ్'డీ, ఎస్ఐడీఐ వంటి ఆధునిక పరికరాలు సమకూర్చాలని, భద్రతా ప్రమాణాలు పెంచాలని కోరారు.

### కార్మిక సంక్షేమం, ప్రధాన అంశాలు..

జులై 2025 నుంచి పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులను సమీక్షించి, అర్హులైన వారికి కారుణ్య నియామకాలు ఇవ్వాలని కోరారు. "ఓన్ హౌస్ స్కీమ్"ను అమలు చేసి, కార్మికులకు సొంత ఇళ్ల కలను నెరవేర్చాలని సూచించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, ఆదాయపు పన్ను రీఫండ్, సహజ మరణ పరిహారాన్ని రూ.25 లక్షలకు పెంపు వంటి అంశాలను ప్రస్తావించారు.

### క్రమశిక్షణ, సర్వీస్ సమస్యలు..

ఎన్'సీడబ్ల్యూఏ బదిలీ పాలసీ, మస్టర్ల సర్క్యులర్‌లను రద్దు చేయాలని, విజిలెన్స్ కేసులను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. తొలగించబడిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కోల్పోయిన ఇంక్రిమెంట్లను పునరుద్ధరించాలని కోరారు.

### నియామకాలు, పదోన్నతులు..

మెడికల్ పూర్తి చేసి వీటీసీ శిక్షణ పొందిన 300 మందికి జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, సీనియర్ మైనింగ్ సర్దార్‌లకు ఓవర్‌మ్యాన్ పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఉన్నత చదువుల కోసం ఎన్'ఓసీలు ఇవ్వాలని కూడా కోరారు.

### ఇతర డిమాండ్లు..

హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని సూచించారు. టెండర్లలో అవకతవకలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం ఆర్థిక బలోపేతం, ఉత్పత్తి పెంపు, కార్మిక సంక్షేమం ఒకేసారి అమలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ స్పష్టం చేసింది. తమ డిమాండ్లపై యాజమాన్యం తక్షణమే స్పందించి, కార్మికులకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. రామగుండం - 2 ఏరియా బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, సాంబమూర్తి, పిట్ సెక్రటరీ బొంత రాజు , అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సంపత్ , షిఫ్ట్ ఇంచార్జి తిప్పని కిరణ్ కుమార్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిరుద్యోగుల సమస్యలు పట్టని సర్కారు

## వేతనాలు అందక పండగ పూట పస్తులు

**- మూడు నెలలుగా వేతనాలు లేవు - మూడు సంవత్సరాలుగా అందని పిఓఎల్ బకాయిలు**

**- వేతనాలు జాప్యం పై అధికారుల పొంతనలేని సమాధానాలు**

**- మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తే కుటుంబాలను ఎలా పోషించాలి.**

**- పిఓఎల్ ఖర్చు బరిస్తు ఉద్యోగాలు చేయలేము**

**- సమస్యలు పరిష్కారించి ఉద్యోగ భద్రత కల్పిస్తే రోగులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాము**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సమయానుకూలంగా వేతనాలు అందక ఎన్.ఎచ్.ఎం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమై రోడ్డున పడ్డాయని తెలంగాణ రాష్ట్ర ఎన్.ఎచ్.ఎం ఉద్యోగుల ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ మహ్మద్ రహీం దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్.ఎచ్.ఎం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నరని, దీనికితోడు పెరిగిన నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, తల్లిదండ్రుల పరిరక్షణ వంటి ఖర్చులతో చిరుద్యోగుల బతుకులు చితికి పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే ఎన్.ఎచ్.ఎం ఉద్యోగుల వేతనాలు గత మూడు నెలలుగా రాకపోవడతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా అత్యంత ముఖ్యమైన ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలు వస్తుండడంతో పరిస్థితిని మరింత క్లిష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.సాధారణంగా పండుగల ముందు కుటుంబ ఖర్చులు పెరుగుతాయని ఈ సమయంలో జీతాలు లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల్లో చాలా మంది నెల జీతంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారని, వచ్చే ఆ అరకొర వేతనం కూడా నెలల తరబడి ఆలస్యం కావడంతో ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఖర్చులు, బ్యాంకు ఈఎంఐలు, నిత్యావసర ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న తాము రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమలో కొత్త ఆశలు చిగురించాయని, కాని కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోగా పరిస్థితి మరింత జఠిలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల సాధకబాధకాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మా లాంటి చిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం ధోరణి ప్రదర్శిస్తుండడం బాధాకరమన్నారు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని, పిల్లల స్కూళ్ల ఫీజులు ఎలా కట్టాలి. అనారోగ్యం పాలైతే వైద్యం ఎలా చేయించుకోవాల్సి ప్రశ్నించారు.

### మూడు సంవత్సరాలుగా అందని పిఓఎల్ బకాయిలు

చాలీచాలని వేతనాలు ఒక ప్రక్క కుటుంబాలను పోషించుకుంటు మరోవైపు ఫోన్ రీచార్జ్, పెట్రోల్ కోసం డబ్బులు వెచ్చించి క్షేత్రస్థాయిలో క్షయ నిర్మూలన కార్యక్రమాలను పర్యవేక్షిస్తు క్షయ అనుమానితుల నుండి సేకరించిన కళ్లె శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం సంబంధిత కేంద్రాలకు తరలించేందుకు వెచ్చించిన శాంపిల్స్ ట్రాన్స్ పోర్ట్ డబ్బులు గత మూడు సంవత్సరాలుగా పెండింగులో ఉన్నాయని దీనిపై తక్షణమే డబ్బులు విడుదల చేయాలని అధికారుల చుట్టు తిరుగినను పొంతన లేని సమాధానాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తమ సమస్యల పరిష్కారానికి ఎక్కని మెట్టు లేదు, తొక్కని గడప లేదని ఆవేదన వ్యక్తం చేసారు. రానున్న పెద్ద పండుగల సందర్భంగా ప్రభుత్వం స్పందించి, ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాలతో పాటు మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న పిఓఎల్, శాంపిల్స్ ట్రాన్స్ పోర్ట్ డబ్బులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు.

# భక్తుల లగేజీ భద్రతకు టీటీడీ భరోసా..

**- తిరుమలలో విస్తృతంగా అందుబాటులో లగేజీ డిపాజిట్ - డెలివరీ కేంద్రాలు**

**- 80 కౌంటర్లు -- 394 మంది సిబ్బంది -- మూడు షిఫ్టుల్లో నిరంతర సేవలు**





**తిరుమల (ప్రశ్న న్యూస్)** శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్ డెలివరీ కేంద్రాలను ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తోంది.భక్తులు దర్శనం, సేవలు, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు తిరుమలలో కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 80 కౌంటర్లు ఏర్పాటు చేసి 394 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు.

### కాలినడక భక్తులకు ప్రత్యేక డిపాజిట్ సౌకర్యం

అలిపిరి శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల ద్వారా తిరుమలకు చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ కేంద్రాల్లో లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలలోని డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యాన్ని టీటీడీ కల్పించింది.తిరుమలలో ప్రధాన డిపాజిట్ కేంద్రాలు తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ మరియు సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది.కల్యాణకట్ట సమీపంలో ప్రత్యేక డిపాజిట్ -- డెలివరీ కేంద్రాలు తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట సమీపంలో కూడా ప్రత్యేక కేంద్రాలను టీటీడీ ఏర్పాటు చేయడం జరిగింది. తిరుమలలో లగేజీ డెలివరీ కేంద్రాలు డిపాజిట్ చేసిన లగేజీని తిరిగి పొందేందుకు కింది డెలివరీ కేంద్రాలు పనిచేస్తున్నాయి లగేజీ డిపాజిట్ - డెలివరీ ప్రక్రియ టీటీడీ లగేజీ డిపాజిట్ కేంద్రాల్లో భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసే సమయంలో సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా క్యూఆర్ కోడ్ జెనరేటర్ చేసి బ్యాగుపై కోడ్ స్టిక్కర్ వేస్తారు. ఆ తర్వాత లగేజీకి సంబంధించిన సమాచారంతో ఒక స్లిప్ జెనరేట్ చేసి భక్తులకు అందిస్తారు. డిపాజిట్ డెలివరీ సమయంలో డెలివరీ కేంద్రంలో ఆ స్లిప్ సిబ్బందికి చూపితే ఆ నెంబర్ ఆధారంగా లగేజీని సులభంగా గుర్తించి ఒక నిమిషంలోపు లగేజీని భక్తులకు అందిస్తారు.

**పండుగలు, ప్రత్యేక దినాల్లో భారీ వినియోగం** టీటీడీ కల్పించిన ఈ సేవలను భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. 2026 జనవరి నెలలో అత్యధికంగా 10,44,268 డిపాజిట్లు నమోదయ్యాయి. 2026 జనవరి 25రథసప్తమి రోజున అత్యధికంగా 1,34,749 డిపాజిట్లు నమోదయ్యాయి. వైకుంఠ ఏకాదశి, గరుడసేవ, రథసప్తమి వంటి ఉత్సవాల సమయంలో భారీగా వినియోగం నమోదవుతోంది.

**భక్తులకు టీటీడీ విజ్ఞప్తి** తిరుమలకు విచ్చేసే భక్తులు తమ వద్ద ఉన్న లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను అధికారిక డిపాజిట్ కేంద్రాల్లో భద్రపరచి, టోకెన్ ఆధారంగా తిరిగి పొందాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. టీటీడీ కల్పిస్తున్న ఈ సేవల ద్వారా భక్తులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం చేసుకునే అవకాశంపపొందుతున్నారు.

# గుత్తేదార్ రాకపాయే ఉగాది ఆగమాయే

- గత కన్నీళ్లు పునరావృతం, “4”నెలల జీతం నరకమాయే
- పండుగ రోజు కుటుంబం పరిషాన్,కష్టాల కడలిలో కన్నీళ్ల పర్వదినం
- పారుగు సేవలు అందిస్తున్న కార్మికుల కన్నీళ్లు తూడిచేదేవరు.?
- ఆరున్నర దశాబ్దాల వయస్సులో సఫాయి పని,గౌరవ వేతనం ఇవ్వాలేక మొఖం చాటేస్తున్న కాంట్రాక్టర్లు






**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో పేదలకు ఈ సర్కార్ శాపంగా మారిందని “రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులని” కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో ఈప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న విషయం అందరికి తెలిసిందే!కానీ పేదలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాల్లో కొన్ని విస్మరించారని ప్రతి పక్షాలు పదే పదే ప్రభుత్వాన్ని ఎండకడుతున్న న్యాయం శూన్యం.ఉన్న అరవై నాలుగు శాఖల్లో కీలకమైనది “వ్యవసాయ శాఖ”రైతు బంధు “లబ్ధిదారులకు ఉగాది కానుకగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.రెండు దఫాలుగా”రైతు ఖాతాలో జమ అవుతాయని సర్కారు పేర్కొన్న విషయం విదితమే.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న “వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పేరుకుపోయిన ఆర్థిక లావాదేవీలు.? సర్కారు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వద్ద గుత్తేదారుల “చెక్కులు”చుక్కలు చూపిస్తున్నాయి.గత కొన్ని నెలలుగా ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల గాక కాంట్రాక్టులు నరకం అను భవిస్తున్నారు .ఇటు కార్మికు లకు గౌరవ వేతనం ఇవ్వాలేక,అప్పుల బాధలతో మోహం చాటేనస్తున్నారు. డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో పొరుగు సేవలు అందిస్తున్న కార్మికుల బాధలు వర్ణనాతీతం.యాభై ఐదు నుంచి డెబ్భై ఏళ్ళ వయసులో కూడా ఉపాధి కోసం కర్మచారి వృత్తిలో కొనసాగుతున్నారు బక్కచిక్కిన పేద బతుకులు.ఒక్కోక్కరిది ఒక్కోక్క ధీన గాథ.కన్న పిల్లలను కొల్పోయిమనవరాళ్లు,మనవడితో జీవితం గడుపుతున్న, మరోకరిది తల కొరివి పెట్టాల్సిన కొడుకే రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ తల్లి పై ఆధారపడిన తనయులు.మరో కన్నీరు పెట్టే విషయం ఏమిటంటే కన్నబిడ్డ భర్త కాలం చేస్తే కళ్ల ముందు కదంతొక్కని అమాయకపు బిడ్డ కోసం గంపెడు చాకరి చేస్తున్న కనికరించరు,అలాగే పండుగ రోజు కూడా సగం జీతం ఇయ్యనీ కాంట్రాక్ట్ లని ఆవేదనతో ఊగిపోతున్న అవ్వలు,తాతలు.బోయిన్ పల్లి ఏఎంసీ లో గత కొన్నేళ్లుగా స్వీపింగ్ విధులు నిర్వహిస్తున్న మహిళా మణులు.వీరి గౌరవ వేతనం అక్షరాలా పన్నెండు వేల రూపాయలు.మారెట్ లో చెత్త చెదారం ఎత్తుతూ,రోడ్లుశుభ్రం చేస్తున్న వారి సంఖ్య ఏడుగురు.అయితే వీరికి గత ఏడాది,అంతకు ముందు ఇద్దరు గుత్తేదారులు జీతాలు ఎగ్గొట్టి,అడిగినప్పుడల్లా మోండి చెయ్యి చూపించారు.ఇక ఇప్పుడైతే ఏకంగా గత నాలుగు నెలలుగా గౌరవ వేతనం లేక,కుటుంబంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి పైసలు లేక కలతలు రేగి గొడవలకు దారి తీస్తుందని వయస్సు మీద పడిన మహిళా ఆవేదన వ్యక్తంచేశారు.అదిగాక నెల జీతం “12”వేలు,ఐదు మాసాల నుంచి రాకపోవడంతో సుమారు అరవై వేల రూపాయలు పెండింగ్లో ఉండడం, గుత్తేదారులు కనీసం పండుగ రోజు సందర్భంగా ఇరవై వేల రూపాయలు ఇస్తే కుటుంబంతో పర్వదినం ఆనందంగా జరుపుకునే వాళ్లమని వివరించారు.లక్ష్మీ, కేతమ్మ,జయమ్మ ఇలా ఏడు మంది ఉదయం 11:00 గంటల నుంచి రాత్రి 7:30 వరకు బోయిన్ పల్లి మార్కెట్ లో సేవలు అందిస్తున్న,మా బ్రతుకులకు గౌరవం లేక కనీసం నెల జీతం అయినా ఉంటే సంతోషంగా ఉండేవాళ్లమని కేతమ్మ తెలిపారు.సర్కార్ అలసత్వమా,కాంట్రాక్టర్ తప్ప ? మాకు తెలియదు కానీ శత్రులకి కూడా ఇలాంటి సమస్యలు రావద్దు అని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.గత మూడున్నర ఏళ్లుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో సఫాయి వాల ఉద్యోగం చేస్తున్న మాకు ఈ ఏడాదిన్నర నుంచి మా బతుకు బండి బలహీనమై మనస్సు చెదిరి,గూటికి చేరక అతలాకుతలం చేస్తోంది మాజీవితం.ఇప్పటికైనా మా జీవితాల పై చిరుమందహాసం చిగురించాలంటే సెక్రటరీ చోరవ చాలా కీలకమైనదని నిన్న బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం ని కలిసి వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.త్వరలోనే మీ సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు హామీ ఇచ్చారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

**- ఖర్గే, వేణుగోపాల్‌తో కీలక భేటీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ అధిష్ఠానంతో కీలక సమావేశాలు జరుపుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన విడివిడిగా భేటీ అయ్యారు. ఖర్గేతో దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షాల తీరు వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పదవుల నియామకాలపై సీఎం అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పార్టీ అభ్యర్థులుగా బరిలోకి దిగిన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా రెండు స్థానాలను గెలుచుకోవడం పట్ల ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లను వారు అభినందించారు. అనంతరం నూతన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని వెంటబెట్టుకుని రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.






# మంచి రోజులొచ్చినట్లేనా.?

**- కేంద్ర నాయకత్వం క్లాస్ తెలంగాణ బీజేపీలో పనిచేస్తుందా.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీకి మంచి రోజులు వచ్చినట్లున్నాయి. ఒకరకంగా అధికార, విపక్ష పార్టీలు తీసుకుంటున్న అనేక నిర్ణయాలు బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2029 లో జరుగుతాయని భావిస్తున్నారు. అంటే ఇంకా మూడేళ్ల సమయం ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనను, కాంగ్రెస్ పాలనను తెలంగాణ ప్రజలు చూశారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే తప్పేంటన్న ఆలోచన చాలా మందిలో బయలుదేరింది. క్షేత్ర స్థాయిలో ఈ మూడేళ్లలో మరింత బలోపేతం అయితే బీజేపీ అధికారంలోకి వచ్చినా ఆశ్చర్యం లేదంటున్నారు.

### ఇప్పటికే బలంగా

తెలంగాణలో ఇప్పటికే బీజేపీ బలంగా ఉంది. క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ వస్తుంది. అందుకే దక్షిణ భారతంలో బీజేపీకి కర్ణాటక తర్వాత తమిళనాడు అధికారంలోకి వచ్చే అవకాశముందన్నది పార్టీ కేంద్ర నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో విజయం సాధించిన బీజేపీ పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో గెలిచింది. అంటే దాదాపు యాభై నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ బలంగా ఉందని అనుకోవాలి. అయితే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకు తేడా ఉంటుంది.

### కేంద్ర నాయకత్వ సూచనలతో

శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయిన వారు పార్లమెంటు ఎన్నికల్లో గెలిచారు. అంటే బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లోనే ఆదరిస్తున్నారన్న వాదన కూడా ఇన్నాళ్లు ఉంది. శాసనసభలో ఓటమి పాలయిన కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ లు పార్లమెంటు ఎన్నికల్లో గెలిచారు. అయితే పార్టీ రాష్ట్ర నాయకత్వం సమైక్యంగా కలసి పనిచేస్తే అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే తెలిపింది. ప్రధాని మోదీ సయితం కొంతకాలం క్రితం పార్టీ నేతలకు క్లాస్ పీకిన నేపథ్యంలో మరి పార్టీని విజయం వైపునకు తీసుకుని వెళ్లే దిశగా కమలం పార్టీ నేతలు ప్రయత్నిస్తారో? లేదో? చూడాలి.

# ఈసారి కూడా కష్టమేనా.?

**- జగన్ మైండ్ సెట్ మార్చుకోవాల్సిందేనా.?**

అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ చాలా మారాల్సి ఉంది. మారకుంటే పార్టీకి ఈసారి కూడా కష్టమే. ఎవరు అవునన్నా కాదనుకున్నా కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను, అటు అభివృద్ధిని అంతే వేగంగా తీసుకెళుతుంది. దీంతో చాలా మంది ప్రజలు మరొకసారి కూటమి ప్రభుత్వానికి అవకాశమిస్తే మంచిదన్న భావనకు కూడా వచ్చే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ, ఈసారి జమిలి ఎన్నికలు జరగుతుండటం కూడా కూటమికి కలసి వచ్చే అవకాశంగా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఓటు బ్యాంకులో మార్పులేదే

వైఎస్ జగన్ ఓటు బ్యాంకు గత ఎన్నికల్లో నలభై శాతం వరకూ వచ్చాయి. అయితే అదే సమయంలో జనసేన ఓటు బ్యాంకు పెరిగిందన్న అంచనాలు వినపడుతున్నాయి. గత ఎన్నికల్లో సింగిల్ డిజిట్ ఓటు శాతం వచ్చిన జనసేనకు ఈసారి డబుల్ డిజిట్ వచ్చే అవకాశం ఉందని అంచనాలు వినిపిస్తున్నాయి. అంటే ఒకవేళ టీడీపీ ఓటు బ్యాంకు కొంత తగ్గినా అది జనసేన పార్టీ కవర్ చేస్తుందంటున్నారు. జగన్ లో ఏ మాత్రం మార్పు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అంటున్నారు. జగన్ అధికారంలో ఉండగా జనం సమస్యలను పట్టించుకోకపోవడం, కేవలం నగదు బదిలీపైనే దృష్టిపెట్టడం వల్ల గత ఎన్నికల్లో భారీగా కూటమి పార్టీలు విజయం సాధించాయి.

### రెండేళ్లవుతున్నా

అయితే ఎన్నికలు జరిగి రెండేళ్లవుతున్నప్పటికీ జగన్ వైఖరిలో మార్పు లేకపోవడంతో పాటు ఇంకా సంక్షేమ పథకాలపైనే తాను గెలుస్తానని చెబుతున్నారు. రెండు ప్రభుత్వాల మధ్య సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు పోల్చి చూసుకుంటున్నారని నిన్న జరిగిన ఒంగోలు నియోజకవర్గ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు చూస్తే జగన్ తిరిగి వెల్ఫేర్ పైనే ఆధారపడి ఎన్నికలకు వెళతారని అందరికీ అర్థమవుతుంది. దీనివల్ల మధ్య తరగతి, ప్రభుత్వ ఉద్యోగులు దూరమవుతారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. జగన్ ఇప్పటికైనా తన మైండ్ సెట్ మార్చుకుని, జనం సమస్యలపై ఫోకస్ పెడతానని మాట ఇచ్చి, అభివృద్ధిని కూడా వేగంగా తీసుకెళతానని చెబితే తప్పించి కొంత మెరుగైన



ఫలితాలు రావన్నది వాస్తవం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588